జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 18, మార్చి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

రాజకోట రహస్యం

# సీఎం రేవంత్ సెక్యూరిటీ కళ్లు కప్పటం సాధ్యమా?

- సెల్ఫ్ డ్రైవింగ్, ప్రైవేటుకారు ప్రయాణం అంత సులభమా?
- సూపర్ ఇమేజ్ ఉన్న ఒక సీఎం ఆ సాహసం చేయగలరా?
- ఇప్పటికీ ఉదయం 5 గంటలకు సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుని వెళ్లిపోతారని కేటీఆర్ సంచలన ఆరోపణ
- సెల్ఫ్ డ్రైవింగ్‌తో మైహోం బూజాకు వెళతారన్న కేటీఆర్
- సీఎం సెక్యూరిటీ అందుకు అనుమతిస్తుందా?
- నిఘా దళానికి సమాచారం తెలియకుండా ఉంటుందా?
- సాగర్ సొసైటీలో ఎంత సేపు గడుపుతారో మాకు తెలియదా?
- రేవంత్ ఎక్కడెక్కడ గోడలుదూకుతాడో తెలుసు
- రేవంత్ దాటిన రేఖలు, తారలు, వాణీల గురించి మాట్లాడగలం
- నేను నోరు విప్పితే ఇంట్లో అన్నం పెట్టరన్న కేటీఆర్
- కేటీఆర్ ఆరోపణలు సత్యమా? సంచలనం కోసమేనా?
- రేవంత్ ఫొటోలున్నాయన్న కేటీఆర్ వాటిని ఎందుకు విడుదలచేయలేదు?
- కేటీఆర్ మీడియా చిట్‌చాట్ వ్యూహాత్మకమా?
- రేవంత్ ఇమేజ్‌ను డామేజ్ చేయడమే కేటీఆర్ లక్ష్యమా?
- రాజకీయ వర్గాల్లో వాడి వేడి చర్చ

(మార్తి సుబ్రహ్మణ్యం)



మహానాడు ఫోకస్

'సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ ఉదయ 5 గంటలకు మైహోం బూజాకు ఒంటరిగా వెళతారు. సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుని వెళుతుంటారు. ఆయన సాగర్ సొసైటీలో ఎంతసేపు గడుపుతారో తెలుసు. రేవంత్ దాటిన రేఖలు, తారలు, వాణిల గురించి మేమూ మాట్లాడగలం. రేవంత్ ఎక్కడెక్కడ గోడలుదూకుతాడో తెలుసు. నేను నోరు విప్పితే రేవంత్‌కు ఇంట్లో అన్నం పెట్టర'ంటూ.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో దుమారం సృష్టిస్తున్నాయి.

సహజంగా ఇప్పటివరకూ రాజకీయాల్లో ప్రత్యర్థుల అవినీతి, కుంభ కోణాల పైనే ఆరోపణలు-ప్రత్యారోపణలు ఉండేవి. కానీ తెలంగాణ రాజకీయాలు ఆ స్థాయి దాటి వ్యక్తిగత-నాలుగుగోడలకు పరిమితమయ్యే వ్యవహారాలను, బజారున చర్చించుకునే స్థితికి చేర్చింది. పదేళ్లపాటు కేటీఆర్‌కు సినిమా తారలతో ఉన్న సంబంధాలపై మొదలయిన ఆరోపణలు.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వరకూ చేరడం.. అప్పుడు ఆరోపణలు ఎదుర్కొన్న కేటీఆర్.. ఇప్పుడు అదే రేవంత్‌పై సరిగ్గా అలాంటి ఆరోపణలు చేయడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

9 నెలల క్రితం వరకూ ఏపీ రాజకీయాల్లో బూతులు వినిపించేవి. రోజా, కొడాలి నాని, పేర్ని నాని, వంశీ అండ్ అదర్స్ టీడీపీ నేతలపై బూతులు లంకించుకునే వారు. ఇప్పుడు వైసీపీ అధికారంలో లేకపోవడంతో, ఆ బూతులు-తిట్లు వినిపించకపోవడంతో జనం హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. కానీ ఇప్పుడు తెలంగాణలో.. సినిమా తారలతో ఉన్న సంబంధాలు రచ్చకెక్కి, వాటిని నేరుగా కాకపోయినా, పరోక్షంగా అయినా అందరికీ తెలిసేలా పరస్పరం ఆరోపణలు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఇందులో అప్పుడు బాధితుడు కేటీఆర్ అయితే.. ఇప్పుడు బాధితుడు రేవంత్‌రెడ్డి! ఇది రాజకీయాల్లో ఆరోగ్యకరం కాదన్నది సీనియర్ల హితోక్తి!!

పదేళ్ల కేసీఆర్ జమానాలో అన్నీ తానై చక్రం తిప్పిన బీఆర్ఎస్ వ ర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మీడియాతో జరిపిన చిట్‌చాట్ రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఈసారి ఆయన తన రాజకీయ ప్రత్యర్థి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుల అవినీతి, భూ కుంభకోణాలు, బిల్లుల కమిషన్లపై కాకుండా.. కేవలం రేవంత్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి చేసిన ఆరోపణలు సహజంగా చర్చనీయాంశంగా మారాయి.

అయితే ఆ ఆరోపణలు సత్యమా? వాటికి ఆధారాలున్నాయా? అవి నిజమైతే కేటీఆర్ వాటి ఆధారాలు ఎందుకు బయటపెట్టలేదు? తన

మిగతా.. 2లో



## విజన్ డాక్యుమెంట్‌తోనే అభివృద్ధి సాధ్యం!

- ప్రతి నియోజవర్గానికి ఒక ప్రణాళిక
- ఎమ్మెల్యే చైర్మన్‌గా కార్యాచరణ
- స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా స్థాయి అధికారి
- పైలట్ ప్రాజెక్టుగా 4 నియోజకవర్గాలకు విజన్ రడీ, త్వరలో మిగిలిన వాటికి రూపకల్పన
- త్రిభాషా సూత్రంపై రాద్ధాంతం వద్దని హితవు
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, మహానాడు: స్వర్ణాంధ్ర విజన్ - 2047 సాధనలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాటిని అమలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ముందు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసినట్లు చెప్పారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల-2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్‌ను సఫలీకృతం చేసుకునేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తున్నామని, దీనికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

మండల, మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్‌ను గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా తీసుకుని అమలయ్యేలా చూస్తామన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ రూపొందించి కలెక్టర్ల సదుస్సులో విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రతి చివరి వ్యక్తిని కూడా విజన్‌లో భాగస్వామిని చేస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ప్రస్తుతం నెలకొన్న సమస్యలు ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం లాగా పరిశ్రమలు తరిమేయడం కాకుండా... తీసుకు రావడం నేర్చుకోవాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలు తేవడంలో మీరు కూడా భాగములు అవ్వాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండాలి...అలానే ఉపాధి కలగాలంటే పరిశ్రమలు రావాలి... సేవల రంగం వృద్ధితో ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

### వికసిత్ భారత్ బాటలోనే...

నాడు 2020 రూపొందించాం. వికసిత్ భారత్ 2047 విజన్ కింద 30 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం కాగా, తలసరి ఆదాయం 18 వేల డాలర్లు పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగా స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపొందించుకుని నిర్దష్టమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలని లక్ష్యం పెట్టుకున్నాం. వృద్ధిరేటు, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాలు ఉన్నాయి. రాయలసీమ రాళ్ల సీమ, ఎడారిగా మారుతుందని గతంలో అందరూ అనుకున్నారు. కానీ రతనాల సీమగా మారుతోంది. సీమ హార్టికల్చర్ హబ్‌గా మారుతోంది. రాయలసీమ సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీకి కేంద్రంగా మారుతుంది. ఒకప్పుడు అనంతపురం కరవు జిల్లా. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు అనంతపురం, మహబూబ్ నగర్ జిల్లాలు సవాల్‌గా ఉండేవి. కృష్ణానది పక్కనున్న మహబూబ్ నగర్‌కు నీళ్లుండేవి కాదు. ఆ రెండు జిల్లాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవాన్ని. విజయవాడ, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాలకు నీళ్లున్నా అభివృద్ధిలేదు. కానీ ఇప్పుడు అనంతపురం జిల్లా 26 జిల్లాల్లో 5వ స్థానంలో ఉంది. మొదటి స్థానానికి వచ్చినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు.

మిగతా.. 2లో

కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ భేటీ అయ్యి పలు అంశాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు.



## ప్రైవేటు యూనివర్సిటీల యాక్ట్‌కు సవరణ అవసరం



- చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధం
- చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉంది
- యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌కు ఏకీకృత చట్టం
- శాసన మండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

అమరావతి, మహానాడు: ప్రైవేటు యూనివర్సిటీస్ యాక్ట్‌ను సవరించాల్సిన అవసరం ఉందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల వివరాలతో పాటు, విశ్వవిద్యాలయ హెూదాను ఇవ్వడానికి అనుసరిస్తున్న ప్రమాణాలు, ప్రభుత్వ నియంత్రణపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 2016లో ఆనాటి ప్రభుత్వం ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన కోసం ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది, అందులో భాగంగానే విట్, ఎస్ఆర్ఎం, సెంచూరియన్, క్రియా యూనివర్సిటీ రాష్ట్రానికి వచ్చాయి.

విట్, ఎస్ఆర్ఎం అమరావతిలో నెలకొల్పగా.. సెంచూరియన్ విజయనగరంలో వచ్చింది. క్రియా యూనివర్సిటీ నెల్లూరు జిల్లాకు వచ్చింది. అభివృద్ధి వికేంద్రీకరణకు ఆనాడు కూడా కట్టుబడి చేసి చూపించామనేందుకు ఇదొక ఉదాహరణ. చట్టానికి ఐదుసార్లు సవరణ చేశాం. అందులో భాగంగా బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీస్ కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే దిశగా గత ప్రభుత్వం పనిచేసింది. నాలుగు యూనివర్సిటీలు.. మోహన్ బాబు యూనివర్సిటీ, హనుమాచార్య యూనివర్సిటీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, ఆదిత్య యూనివర్సిటీలు బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీస్ కింద వచ్చాయి.

### యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా చట్టం ఉంది

ఈ యాక్ట్‌లో చేసిన సవరణల వల్ల ఇక రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీలు వచ్చే పరిస్థితి లేదు. ఈ యాక్ట్ యూజీసీ రెగ్యులేషన్స్‌కు విరుద్ధంగా ఉంది. ప్రధానంగా కంపల్సరీ జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీస్ అనేది మాన్ డేటరీగా పెట్టారు. దీంతో కనీసం 30 శాతం కోర్సు.. టై అప్ అయిన ఫారిన్ యూనివర్సిటీస్ లో చదవాలనే నిబంధన పెట్టారు. యూజీసీ మాత్రం ఒప్పందం చేసుకోవాలంటే కచ్చితంగా ఆ సంస్థలకు న్యాక్ అక్రిడేషన్ ఉండాలని చెప్పింది. కనీసం రెండు గ్రాడ్యుయేట్ బ్యాచ్ లన్నా, ఆరేళ్ళ ఎగ్జిస్టెన్సీ ఉండాలని, వెయ్యికి పైగా పబ్లికేషన్స్ చేసుండాలి, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ లో ఇన్ స్టిట్యూషన్స్ కనీసం మూడు గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ లు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో కనీసం మూడు గ్రాడ్యుయేటింగ్ బ్యాచెస్ ఉండాలని యూజీసీ చెబుతోంది.

మనం చేసిన చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉండడం వల్ల మనకు ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలు రాకుండా పోయాయి. హయ్యర్‌ఎడ్యుకేషన్ లో గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో.. ఏపీలో 36.5శాతం ఉంది. తమిళనాడులో 47శాతం, కేరళలో 41.3శాతం ఉంది. దీనిపై దృష్టిసారించాం. ఏపీసెట్ ద్వారా 35 శాతం సీట్లు భర్తీ అవుతాయి.

మిగతా.. 2లో

## పోలీసులపై వైసీపీ పగ!

- ఆ ఫలితమే వీఆర్
- ఆ సంస్కృతి, కక్ష కూటమిది కాదు
- కొందరు పోలీసులకు ఏళ్లకేళ్లు జీతాలివ్వలేదు
- వీఆర్‌లో పోలీసులకు వేతనం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం
- పోలీసుల గురించి గత ప్రభుత్వాన్నెందుకు అడగలేదు?
- ఎంఎల్సీ ఏసురత్నం ప్రశ్నకు హెూంమంత్రి అనిత కౌంటర్



అమరావతి, మహానాడు: పగబట్టి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం పోలీసులను వీఆర్‌కు పంపిందని హెూంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఆ విధానం, సంస్కృతి కూటమి ప్రభుత్వానిది కాదని ఆమె స్పష్టం చేశారు. కొందరు పోలీసులకు ఏళ్లకేళ్లు గత ప్రభుత్వం జీతాలివ్వలేదని పేర్కొన్నారు. 2014-19 సమయంలో వీఆర్‌లో ఉన్నా పోలీసులకు సగం జీతం అందించామన్నారు. వీఆర్ సాకుతో గత వైసీపీ ప్రభుత్వం మూడు నాలుగేళ్లపాటు ఏ పోలీసుకు పైసా జీతం ఇవ్వలేదన్నారు. టీడీపీ సానుభూతిపరులని భావించి జగన్ ప్రభుత్వంలో పోలీసులను వీఆర్ లో ఉంచారన్నారు. ప్రస్తుతం

మిగతా.. 2లో

## కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక నిలిచిన పీహెచ్‌సీల నిర్మాణాలు

- ఆర్భాటంగా నాడు-నేడు కార్యక్రమాన్ని చేపట్టారే తప్ప ప్రయోజనం శూన్యం
- అసెంబ్లీలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, మహానాడు: గత ప్రభుత్వం కొత్త పిహెచ్ సిలను నిర్మిస్తామంటూ ఆర్భాటంగా చేపట్టిన నాడు -నేడు కార్యక్రమం అసంపూర్తిగానే మిగిలిపోయిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కొత్త పీహెచ్‌సీల నిర్మాణంపై శాసనసభలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సక్రమంగా బిల్లులు చెల్లించనందువల్లే పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. ప్రత్యేకించి విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గ శాసన సభ్యుడు పంచకర్ల రమేష్ బాబు సబ్బవరం పీహెచ్ సీకి సంబంధించి అడిగిన ప్రశ్నపై మంత్రి స్పందిస్తూ ఈ వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో రు.1.04 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారని, అయితే కాంట్రాక్టర్ మాత్రం రు.24 లక్షల మేర పనులు మాత్రమే చేసి, నాటి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో పనులు నిలిపివేశారన్నారు. తరువాత ఐదు సార్లు టెండర్లు పిలిచినప్పటికీ చేసిన పనులకు బిల్లులు రావన్న భయంతో కాంట్రా క్టర్లెవరూ ముందుకు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ కొత్త పీహెచ్ సీని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిదని, త్వరలోనే అందుకు సంబంధించిన టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. సభ్యులడిగిన సీహెచ్‌సీ అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనను కూడా తాం పరిశీలిస్తామన్నారు. ప్రతి పిహెచ్సికి రు.1.43 లక్షల వంతున కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వం రు.670 కోట్ల అంచనా వ్యయంతో 1972 పీహెచ్ సీల నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ బిల్లుల చెల్లింపు సమస్యతో కాంట్రాక్టర్లు కేవలం రు.426 కోట్ల మేర పనులు

మిగతా.. 2లో



07

పొట్టి శ్రీరాములు పేరు అందుకే తొలగించాం



06

రేవంత్ సెల్ఫ్‌డ్రైవింగ్‌తో రహస్య యాత్ర



05

ఏఐ సాయంతో గుండె జబ్బులు నిర్ధారణ



## మాతృభాషే మన చిరునామా!

- తెలుగువారు ఎక్కడున్నా తెలుగులోనే మాట్లాడుకోవాలి
- మనుగడ కోసం ఇతర భాషలూ అవసరమే
- తల్లిలాంటి మాతృభాష అన్నింటికన్నా ముఖ్యం
- గత ప్రభుత్వం తెలుగును చంపేయాలనుకుంది
- శాసన సభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు

విజయవాడ, మహానాడు: మన చిరునామా మాతృభాష అని, మాతృభాషను ప్రేమించని వాడు, తల్లిని ప్రేమించని వాడితో సమానమని ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఫెడరేషన్

మిగతా.. 2లో



## ఆటకు అంతా సిద్ధం!

- నేటి నుంచి ప్రజాప్రతినిధుల క్రీడలు
- శాప్ ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు
- కోర్టులను పరిశీలించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- రేపు మూడు గంటలకు ప్రారంభం
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు వెల్లడి

విజయవాడ, మహానాడు: ప్రజాప్రతినిధులకు ఉపశమనం కలిగించేదిశగా కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు శాప్ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసినట్టు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడలకు సంబంధించి

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 18, మార్చి 2025 ||

# విజన్ డాక్యుమెంట్‌తోనే అభివృద్ధి సాధ్యం!

**మొదటి పేజీ తరువాయి..**

### ప్రతి కుటుంబానికి సొంతిల్లు

నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇస్తాం. గత ప్రభుత్వం సెంటు పట్టాను ఊరికి దూరంగా ఇచ్చింది. దాంతో అవి ఎవరికీ పనికిరాకుండా, చాలీచాలనట్టుగా ఉండటంతో నిరుపయోగం అయ్యాయి. సెంటు పట్టా ఉన్నచోటనే స్థలం కావాలంటే రెండు సెంట్లు స్థలం ఇస్తాం. 2029 నాటికి ప్రతి కుటుంబానికి సొంతిల్లు నిర్మిస్తాం.

### 35 లక్షల మందికి పీ4 ఫలాలు

రాష్ట్రంలో 35 లక్షల మంది అట్టడుగు స్థాయిలో ఉన్నారు. వీరిలో మొదటి దశ కింద 20 లక్షల మందిని, రెండో దశలో 15 లక్షల మందిని పీ4లో భాగస్వాముల్ని చేస్తాం. పేదలను దత్తత తీసుకునే వారికి ప్రభుత్వం తరపున అవార్డులు, గుర్తింపు ఇచ్చి గౌరవిస్తాం.

### ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ వివరాలివి

### స్వర్ణాంధ్ర-నియోజకవర్గాలు 2047 విజన్

వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రాష్ట్రాన్ని రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా ప్రభుత్వ ఆశయం. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తాం. దీనికి 'సూక్ష్మం నుంచి సూక్ష్మం' అనే విధానాన్ని అనుసరిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో, ఇప్పుడు నియోజకవర్గస్థాయిలో విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం.

### 2047-48 నాటికి ఆర్థిక వృద్ధి అంచనాలు

వ్యవసాయం-అనుబంధ రంగాల ఆదాయం : 2024-25 కాలానికి రూ.5,17,482 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.6,02,728 కోట్లు అవుతుందని అంచనా. 2028-29 నాటికి రూ.8,91,331 కోట్లకు చేర్చడం లక్ష్యం. పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయం : 2024-25 కాలానికి రూ.3,40,387 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.3,99,358 కోట్లకు ఉంటుందని అంచనా. 2028-29 నాటికి రూ.6,32,748 కోట్లకు చేరుతుందని భావిస్తున్నాం. సేవల ద్వారా ఆదాయం : 2024-25 కాలానికి రూ.6,12,045 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.7,10,714 కోట్లకు ఉంటుందని అంచనా. 2028-29 నాటికి రూ.11,69,728 కోట్లకు పెరిగేలా చూస్తాం. ఇక 2047-48 నాటికి వ్యవసాయం, అనుబంధరంగాల ఆదాయం రూ.52,56,052 కోట్లు, పరిశ్రమల ఆదాయం రూ.74,00,083 కోట్లు, సేవారంగం రూ.1,55,88,891 కోట్లకు చేరుకునేలా రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను అమలు చేస్తాం. ప్రస్తుత ధరల్లో జీఎస్డీడీపీ : 2024-25 కాలానికి రూ.15,93,062 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీఎస్డీపీ రూ.18,65,704 కోట్లు, 2028-29 నాటికి రూ.29,29,402 కోట్లు, అలాగే 2047-48 నాటికి రూ.3,08,11,722 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే తలసరి ఆదాయం 2024-25లో రూ.2,98,058 ఉంటే, ఈ ఏడాది రూ.3,47,871, 2028-29లో రూ.5,42,985, 2047-2048 నాటికి రూ.54,60,748కి చేరుకుంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వృద్ధి 2024-25లో 12.02 శాతం ఉండగా, 2025-26కు వృద్ధి 17.11 శాతం, 2028-29కి 16.23 శాతం, 2047-48కి 11.97 శాతం ఉంటుందని అంచనా.

### స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు

ప్రస్తుతం 5.3 కోట్లుగా ఉన్న జనాభా 2047 నాటికి 5.8 కోట్లకు చేరుకుంటుంది. అలాగే 70.6 ఏళ్లుగా ఉన్న సగటు జీవితకాలం 85 ఏళ్లకు పెరుగుతుంది. పట్టణ జనాభా 36 శాతం 60 శాతానికి చేరుకుంటుంది. 100 శాతం అక్షరాస్యత సాధిస్తాం. నిరుద్యోగ రేటు 4.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గనుంది. ఎగుమతులు రూ.1.68 లక్ష కోట్ల నుంచి 39.12 లక్షల కోట్లకు వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

### స్వర్ణాంధ్రకు పది సూత్రాలు

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారానికి 10 సూత్రాలు... స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు. 1. పేదరికం లేని సమాజం, 2. ఉద్యోగ, ఉపాధి కల్పన, 3. నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, 4. నీటి భద్రత, 5. ఫార్మర్ అగ్రిటెక్, 6. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, 7. ఇంధన వనరుల సమర్థ వినియోగం, 8. నాణ్యమైన ఉత్పత్తులు, 9. స్వచ్ఛాంధ్ర, 10. డీప్ టెక్.

### విభాగాల వారీ థీమ్ విజన్

రాష్ట్ర విజన్, విభాగాల వారీ థీమ్ విజన్, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్, మండలం-మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్... ఇలా ఐదు దశల్లో విజన్ ఫ్రేమ్ వర్క్ రూపొందించుకుంటున్నాం.

### మండలం-జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్

రాష్ట్రంలోని 686 మండలాలకు సంబంధించి బలాలు, అవకాశాలు గుర్తించాం. మండల స్థాయిలో ప్రాథమిక రంగంపైనా, కీ గ్రోత్ ఇంజిన్స్‌పైనా దృష్టి పెట్టాం. 2028-29 కల్లా విభాగాల వారీగా ఐదేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో ఇవి రూపొందించాం. రాష్ట్రంలోని 26 జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నాం. మౌలిక వసతులు, ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చేయడంతో పాటు... వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, గవర్నెన్స్‌కు లక్ష్యాలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో సుస్పష్టంగా ఉన్నాయి.

### నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల అభివృద్ధికి మైక్రో లెవెల్ ప్లానింగ్ అనుసరిస్తున్నాం. ఫిజికల్ అండ్ సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాలపై దృష్టి పెడతాం. రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ప్రాజెక్టులు చేపడతాం. కుటుంబ స్థాయిలో అభివృద్ధి-సాధికారత సాధించడం, సామాజిక భద్రత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. పీ4 విధానం, జనాభా నిర్వహణ ప్రభుత్వ ప్రాధాన్యాలు.

### 2029 కల్లా హామీలు నెరవేరుస్తాం

ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి కుటుంబానికి ఇళ్లు, పారిశుధ్య సౌకర్యం, నీటి సరఫరా, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, డిజిటల్ కనెక్టవిటీ, ఎలక్ట్రిసిటీ, సోలార్ రూఫ్ టాప్, రహదారుల అనుసంధానం, డ్రైనేజీ నెట్వర్క్, వేస్ట్ టు వెల్త్, స్ట్రీట్ లైటింగ్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తాం.

### ప్రణాళికల అమలుకు ఫ్రేమ్‌వర్క్

సచివాలయం, మండలం, మున్సిపాలిటీ, నియోజకవర్గం, జిల్లాల వారీగా విజన్ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. పీ4, జీరో పావర్టీ, బ్లూ ఎకానమీ, నాలెడ్జ్-ఇన్నోవేషన్, పాపులేషన్ మేనేజ్మెంట్ వంటి థీమ్ స్పెసిఫిక్ టాస్క్‌ఫోర్స్‌లను స్టీరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుంది. చివరి అత్యుత్తమ అధికార కేంద్రంగా లీడర్‌షిప్ కౌన్సిల్ పనిచేస్తుంది.

### సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు

నియోజకవర్గం స్థాయిలో విజన్ డాక్యుమెంట్ కార్యరూపం దాల్చేందుకు ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యే చైర్మన్‌గా, జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తాం. వీరికి సహాయంగా ఒక యంగ్ ప్రొఫెషనల్‌ను, జీఎస్‌డబ్ల్యుఎస్ నుంచి ఐదుగురిని నియమిస్తాం. ఈ మొత్తం వ్యవస్థను నియోజకవర్గ విజన్ మానిటరింగ్ యూనిట్ పర్యవేక్షిస్తుంది. ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారికి సమర్థత, జవాబుదారీతనం పెంచేందుకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారం చేసుకుని ర్యాంకులను నియోజకవర్గం వారీగా ఇవ్వడం జరుగుతుంది. నెలకోసారి రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖలు డిజిటల్ డ్యాష్ బోర్డు ద్వారా పురోగతిని పరిశీలిస్తాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 2 నెలలకు ఒకసారి, ముఖ్యమంత్రి 3 నెలలకు ఒకసారి విజన్ డాక్యుమెంట్ అమలును సమీక్షిస్తారు.

### త్రిభాష విధానంలో తప్పేముంది..

ఇంగ్లీష్ మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ భాష కేవలం కమ్యునికేషన్‌కు మాత్రమే. మాతృభాషలో చదువుకున్న వారే ప్రపంచ వ్యాప్తంగా రాణించారు. భాష అనేది ద్వేషించడంలో అర్థం లేదు. మాతృభాష తెలుగు, హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళ్తున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుంది.

# ప్రైవేటు యూనివర్సిటీల యాక్ట్‌కు సవరణ అవసరం

**మొదటి పేజీ తరువాయి..**

మిగతా 65 శాతం సీట్లు మెరిట్ ప్రకారం భర్తీ చేస్తారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విషయానికి వస్తే అడ్మినిస్ట్రేషన్ పర్పసెస్ కోసం యూనిఫైడ్ యాక్ట్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నాం.

### ప్రైవేటు యూనివర్సిటీస్ యాక్ట్‌ను సమీక్షిస్తాం

ప్రైవేటు విశ్వవిద్యాలయాల యాక్ట్ ను సమీక్షిస్తున్నాం. మంచి విశ్వవిద్యాలయాలు రావాల్సి ఉంది. అమరావతిలో బిట్స్ వచ్చేందుకు సిద్ధంగా ఉంది. కేంద్రం కూడా ఫారిన్ యూనివర్సిటీలను దేశంలో పెద్దఎత్తున ఏర్పాటుచేయాలనే ఆలోచన చేస్తోంది. మనం చేసిన చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. దానిని సవరించాల్సిన అవసరం ఉందని మేం బలంగా నమ్ముతున్నాం. దీనిపై పూర్తిస్థాయిలో మేం చర్చిస్తాం..

త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్‌ల విషయానికి వస్తే.. గవర్నెన్స్ కోసం గ్లోబల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్(గిగ్) ను కేబినెట్‌లో ప్రతిపాదించాం. ఇందుకోసం సబ్ కమిటీని నియమించాం. నేను, మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి బాధ్యత పెట్టారు. రీసెర్చ్ పేపర్ కూడా మేం తయారుచేశాం. టోనీ బ్లెయర్ ఇన్ స్టిట్యూట్‌తో కలిసి గుడ్ గవర్నెన్స్ కోసం ప్రపంచస్థాయి శిక్షణ సంస్థను ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన ఉంది.

పరిశోధన అనేది చాలా అవసరం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో పీహెచ్‌డీ విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారు. తమిళనాడులో మనకంటే నాలుగురెట్లు ఎక్కువగా ఉన్నారు. ఇందుకు పీజీ ఫీజు రీయింబర్స్ మెంట్ ఒక కారణం. దీనిపై అధ్యయనం చేస్తున్నాం. ఏఐ, హ్యూమనాయిడ్స్, డీప్ టెక్‌పై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. అమరావతిలో డీప్ టెక్ సంస్థను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. విశాఖలో ఏఐ యూనివర్సిటీ నెలకొల్పుతాం. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

### గంజాయి, డ్రగ్స్ అణచివేసే విషయంలో కఠినంగా ఉంటాం

గంజాయి, డ్రగ్స్ అణచివేసే విషయంలో కూటమి ప్రభుత్వం కఠినంగా ఉంటుంది. ఈగల్ విభాగాన్ని ఏర్పాటుచేయడం అయింది. ఇందులో పని చేసే పోలీసు సిబ్బందికి అదనంగా 30 శాతం జీతాలు ఇస్తూ జీవో కూడా జారీ చేశారు. సాంకేతిక సాయం కూడా అందిస్తున్నాం. ప్రతి యూనివర్సిటీ, స్కూల్స్‌లో ఈగల్ కమిటీలు ఏర్పాటుచేసి చైతన్యం తీసుకువస్తామని చెప్పారు.

# కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక నిలిచిన పీహెచ్‌సీల నిర్మాణాలు

**మొదటి పేజీ తరువాయి..**

మాత్రమే పూర్తి చేశారని, అందులో కూడా కేవలం రు.250 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయన్నారు.

మిగిలిన బిల్లుల బకాయిలను గత ప్రభుత్వం కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా అప్పగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చాక పిహెచ్సిల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రు.276 కోట్లు విడుదల చేసిందన్నారు. నాడు-నేడు కార్యక్ర మంలో భాగంగా పాత పీహెచ్ సీల పునరుద్ధరణ కార్యక్రమాన్ని గత ప్రభుత్వం చేపట్టినప్పటికీ అది కూడా అసంపూర్తిగానే నిలిచిపోయిందన్నారు.

ఈ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టటానికి వీలుగా నిధుల లభ్యతపై తమ ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అసంపూర్తిగా వున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కూడా తమ ప్రభుత్వం నిధులను మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు కింద జరిగిన పనులన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయాయని, జరిగిన పనుల్లో కూడా నాణ్యత లేదని తమ పరిశీలనలో తేలిందని మంత్రి వివరించారు.




బంజారహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్న ఎమ్మెల్యే

# పోలీసులపై వైసీపీ పగ!

**మొదటి పేజీ తరువాయి..**

199 మంది పోలీసులు వీఆర్‌లో ఉన్నారని శాసన మండలికి హోంమంత్రి వివరించారు.

టీడీపీ ప్రభుత్వంలో ఆరోపణలు, వివాదాస్పద నిర్ణయాలప్పుడే పోలీసులను వీఆర్‌కు పంపినట్టు తెలిపారు. విచారణ పూర్తై అనుమతిరాగానే పెండింగ్ బిల్లులు, శాలరీలు ఒకేసారి చెల్లిస్తున్నట్టు వీఆర్‌పై కూటమి ప్రభుత్వ విధానాన్ని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏళ్లకేళ్లు జీతాలివ్వకపోయినా ఎందుకు మౌనం వహించారని వైసీపీ ఎంఎల్‌సీ ఏసురత్నాన్ని హోంమంత్రి అనిత సూటిగా ప్రశ్నించారు. వీఆర్ లో శాంక్షన్డ్ పోస్టులు 26 ఉన్నాయన్నారు. వీరెవరికి జీతాలు ఆగవన్నారు. డిప్యుటేషన్ వేకెన్సి కింద ఏసీబీ, విజిలెన్స్‌లో సేవలు వినియోగించుకుంటామన్నారు. పోలీసు అయ్యుండి సాటి పోలీసుల గురించి ఎంఎల్సీ ఏసురత్నం నాడెందుకు ప్రశ్నించలేకపోయారో చెప్పాలన్నారు. సరెండర్ లీవ్, జీతాలు ఇవ్వలేదు, ఇచ్చినవి కూడా ఒకటో తేదీన ఇవ్వలేదు, భద్రత కల్పించలేదు..అప్పుడేం చేశారని నిలదీశారు. మానవతా దృక్పథంతో పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని హోంమంత్రి వెల్లడించారు. వీఆర్‌లో ఉన్నవారికి పూర్తి జీతాలివ్వాలన్న ఛైర్మన్ మోషేన్ రాజు సూచనను పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.

ఇదిలా వుండగా, అనకాపల్లి జిల్లా, చినగుమ్ములూరు వద్ద జరిగిన రొయ్యల పరిశ్రమ బస్సు ప్రమాదంపై హోంమంత్రి అనిత స్పందించారు. రోడ్డు ప్రమాదంపై ఆమె ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. పాయకరావుపేట ఎస్.రాయవరానికి చెందిన బాధితులతో ఫోన్ లో మాట్లాడి హోంమంత్రి ధైర్యం చెప్పారు. నక్కపల్లి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తక్షణమే పరామర్శించి, వారి యోగక్షేమాలు చూడాలని స్థానిక నేతలను హోంమంత్రి ఆదేశించారు.

# ఆటకు అంతా సిద్ధం!

**మొదటి పేజీ తరువాయి..**

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం నుంచి క్రీడలు జరగనున్నాయన్నారు. ఆ ఏర్పాట్లను ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల సుధీర్ రెడ్డి, సుందరపు విజయ్ కుమార్, పీవీజీఆర్ నాయుడు(గణబాబు), ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పంచుమర్తి అనురాధతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు.

క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, థగ్ ఆఫ్ వార్, తదితర కోర్టులను పరిశీలించి ట్రయల్ గేమ్స్ నిర్వహించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, క్రీడా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. దానిలో భాగంగానే కమిటీ సభ్యులంతా పదిరోజులుగా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాల్లో 13 క్రీడలను నిర్వహించనున్నామని, మంగళవారం మధ్యాహ్నం క్రీడా శాఖా మంత్రి, స్పీకర్ కలిసి క్రీడలను సాయంత్రి ప్రారంభిస్తారన్నారు.

20వ తేదీన క్రీడలు ముగిసిన తర్వాత గెలుపొందిన బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ ప్రజాప్ర తినిధులను సైతం క్రీడల్లో భాగస్వాములను చేస్తుందన్నారు. తద్వారా వారి నియోజకవర్గాల్లోనూ క్రీడలను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా శాసనసభ్యుల క్రీడలతో ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధికి నోచుకోవడం సంతోషకరమన్నారు.

### క్రీడల నిర్వహణపై సమీక్ష..

మూడురోజులపాటు జరిగే ప్రజాప్రతినిధుల క్రీడలను ఆయా స్టేడియాల్లో ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించనున్నట్టు క్రీడల కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివరించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి శాప్ కోచ్‌లు, డీఎస్డీఓలతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఒక్కో డీఎస్డీఓకు ఒక్కో క్రీడను కేటాయించారు. వారికి కేటాయించిన క్రీడలకు సంబంధించి జట్టులను, మ్యాచులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తొలుత థగ్ ఆఫ్ వార్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, టెన్నిస్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, రన్నింగ్, టెన్నికాయిట్ క్రీడలను నిర్వహిస్తామని వెల్లడించారు. క్రీడల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వసతులు సమకూర్చాలని విశాఖ ఈస్ట్ ఎమ్మెల్యే గణబాబు సూచించారు. అలాగే స్టేడియానికి వచ్చే ప్రజాప్రతినిధులు, న్యాయ నిర్ణేతలు, శాప్, మున్సిపల్ అధికారులు ఇబ్బందిపడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రతిచోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అనురాధ తెలిపారు. క్రీడా సామగ్రి పంపిణీ, రిసెప్షన్, శానిటేషన్ విభాగాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గణబాబు, సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌లు సూచించారు.

ప్రతీ విభాగానికి ఒక్కో ఇంఛార్జ్ ఉండాలని, దానికారణంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయ న్నారు. కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, డీఎస్డీఓలు, శాప్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషే మన చిరునామా!

**మొదటి పేజీ తరువాయి..**

ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో వారధి కార్యక్రమం జరిగింది.

ముఖ్య అతిథిగా హాజరైన ఉపసభాపతి రఘురామ మాట్లాడుతూ.. తెలుగువారికి భాష మీద మమకారం ఉండేలా, ఆ మూలాలు మర్చిపోకుండా ఉండాలి అంటే వారికి మాతృభాషలో చదువుకునే విధంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం ఇవ్వాలని అన్నారు. అదే ఉద్దేశంతో రాజ్యాంగం ప్రతిపాదిస్తే, కొందరు విద్యాశాఖాధికారులు రాష్ట్ర సరిహద్దుల్లో అటు ఇచ్ఛాపురంలో ఒడియా వారికి, ఇటు తమిళనాడు సరిహద్దుల్లో తమిళులకు వారి మాతృభాషల్లో పాఠశాలలు పెట్టమనే కానీ తెలుగు పాఠశాలల గురించి కాదని వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పక్క రాష్ట్రాల వారి పిల్లలకు వారి మాతృభాష గురించి చెప్పమనడం అంటే మన రాష్ట్రంలో తెలుగు వద్దని కాదని అర్థం చేసుకోవాలని హితవు పలికారు. మనం తప్పనిసరిగా మాతృభాష మాధ్యమాన్ని అమలు చేయడంతోపాటు, వారికి కూడా అవకాశం కల్పించాలనే ఆలోచన అని, కానీ పరమానందయ్య శిష్యుల్లాగా అర్థం చేసుకోలేకపోతే తాను నచ్చజెప్పే ప్రయత్నం చేశానని వివరించారు. అయినా వారికి అర్థం కాలేదని, ఇకనైనా అర్థం చేసుకోవాలని సూచించారు.

అదృష్టవశాత్తూ తెలుగు ప్రజలు తమ భాషకు, జాతికి జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకోగలిగారన్నారు. పరాయి భాషలను నేర్చుకుందాం కానీ తెలుగును విస్మరించకూడదని పునరుద్ఘాటించారు. అందరూ తెలుగులో రాయగలగాలి, చదవగలగాలని ఆకాంక్షించారు. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అన్న తెలుగులో ఉన్న పద్యం ఇతర భాషల్లో పద్యం అనే ప్రక్రియ లేదని, అంతటి ఉత్కృష్టమైన భాష మన తెలుగని ప్రశంసించారు. ఎన్నో సాహిత్య విలువలున్న తెలుగు భాష మనకుందన్నారు.

అందుకే మనం మర్చిపోకూడదని, తెలుగు భాష సంపదను కాపాడుకుంటూ తెలుగువారందరినీ ఒక చోటకు చేర్చిన ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షుడు గంజి జగన్ బాబు, ప్రధాన కార్యదర్శి కంటె అశోక్, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు మాట్లాడాలంటే కొందరు ఫీలవుతున్నారని, కానీ తమిళనాడులో తమిళం మాట్లాడకపోతే ఫీలవుతారని గుర్తు చేశారు. మనుగడకు అన్ని భాషలు అవసరమే కానీ, మాతృభాషను మర్చిపోయేలాగా కాదని ఉపసభాపతి స్పష్టం చేశారు. మనం మనుగడ సాగించాలంటే ఇతర భాషలు కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలి కానీ, మన భాషను మర్చిపోయి కాదని పునరుద్ఘాటించారు.

ఈ సందర్భంగా గతంలో పార్లమెంటులో మాట్లాడింది గుర్తు చేశారు. రాజ్యాంగంలోని 350 ఏ ఆర్టికల్‌లో ఎక్కడైనా సరే ఐదో తరగతి వరకు మాతృభాష మాధ్యమంలో అవకాశం ఇవ్వాలని ఉందని, ఆ వయసులో అవగాహన, అర్థం చేసుకునే శక్తి మాతృభాషలో అయితే ఉంటుందని తెలిపారు. మాతృభాషను ప్రేమించని వాడు తల్లిని ప్రేమించని వాడితో సమానమన్న నానుడిని గుర్తు చేశారు. మన సంస్కృతి, సంప్రదాయం అయిన మన తెలుగు భాషను మనం మర్చిపోవడం చాలా దురదృష్టమన్నారు.

గత ప్రభుత్వంలో నాలుగున్నర సంవత్సరాల క్రితం తెలుగు భాషను చంపేయడం తగదని మాట్లాడినందుకు నాలుగేళ్లు ఢిల్లీలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ పుట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మన భాషను ద్వేషిస్తే, ఎక్కడో మహారాష్ట్రలో నివసిస్తూ జగన్ బాబు మన తెలుగు భాష మాట్లాడేవారందరినీ కలపాలనే ఉద్దేశంతో ఈ సభ నిర్వహించడం ఎంతో సంతోషాన్నిస్తోందని పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ మహారాష్ట్రతోపాటు ఇప్పుడు ఏర్పాటు చేసిన ఆంధ్రా, తెలంగాణ, మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ లోగోను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమన్నారు.

తెలుగు వారిని గౌరవించుకోవాలని, తెలుగు వారు కలుసుకున్నప్పుడు మనమందరం మాతృభాషలో మాట్లాడుకోవడం మన భాషకు ప్రాచుర్యం కల్పించినట్లవుతుందని ఉపసభాపతి రఘురామకృష్ణం రాజు పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో నటించడం వల్ల భాషపై మమకారం మరింత పెరిగిందన్నారు. తెలుగువాడిగా జన్మించడం మనకు గర్వకారణమన్నారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ శ మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి ఎంతో చరిత్ర ఉందని, ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ప్రతినిధులు, సాహిత్యప్రియులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ సెక్యూరిటీ కళ్లు కప్పటం సాధ్యమా?

**మొదటి పేజీ తరువాయి..**

దగ్గర ఫొటోలు కూడా ఉన్నాయన్న కేటీఆర్, తాను రేవంత్‌పై చేసిన ఆరోపణలు నిజమైతే.. నిత్యం ఎక్స్‌లో చురుకుగా ఉండే ఆయన, వాటిలో ఒక్క ఫొటో కూడా ఎందుకు పోస్టు చేయలేదు? అంటే ఇవన్నీ మహిళలలో రేవంత్‌కు ఉన్న ఇమేజీని, డామేజీ చేసేందుకు వ్యూహాత్మకంగా చేసిన ఆరోపణలా? అసలు అవి సాధ్యమేనా?

నిరంతరం భారీ సెక్యూరిటీతో ఉండే ఒక సీఎం.. అందునా బోలెడు ఇమేజ్ సంపాదించుకున్న రేవంత్, మీడియా-సోషల్‌మీడియా చురుకుగా ఉన్న ఈ కాలంలో అందరి కళ్లు ప్పి, సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుని ఇష్టం వచ్చిన చోటకు వెళ్లేంత సాహసం చేయగలరా? అన్న చర్చకు తెరలేచింది.

పూర్వం రాజులు అధికారులకు పాలన వదిలేసి, విలాసాల్లో మునిగేవారు. భోగలాలసుడైన రాజుకు, రాజ్యంలోని వాస్తవ పరిస్థితులు తెలియకుండా ఉండేందుకు, ఆయన చుట్టూ ఒక కోటరీ ఉండేది. ఆ కోటరీ రాజును భ్రమల్లో, మాయాప్రపంచంలో ఉంచేది. మీ పాలన అద్భుతం.. అపురూపం.. అనితర సాధ్యం.. అనన్య సామాన్యమని.. ఇప్పటి కొన్ని మీడియా సంస్థలు, కోటరీల మాదిరి భజన చేసేవి. కొన్నాళ్ల తర్వాత రాజుకు నిజాలు తెలిసినా, అప్పటికే జరగవలసిన నష్టం జరిగేది.

అదే తెలివైన రాజులు కోటరీ మాటలు నమ్మకుండా.. తన పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు? ప్రజలు ఎలా ఉన్నారని తెలుసుకునేందుకు రకరకాల మారువేషాలలో వెళ్లి, నిజాలు తెలుసుకుని, మళ్లీ రాజ్యానికి వచ్చి తగిన చర్యలు తీసుకునేవారు.

తమ పాలనపై విమర్శలు చేసేందుకు, కొంతమందిని జీతం ఇచ్చి మరీ నియమించుకునేవారు. వారు కూడా రాజ్యంలో జరుగుతున్న వాస్తవ దృశ్యాలు, ప్రజాభిప్రాయాలను ఆవిష్కరించేవారు. అంతేగానీ.. ఇప్పటిమాదిరిగా వ్యతిరేకంగ రాసే వాళ్లను పది అడుగులు పాతరేస్తాం.. బట్టలూడదీసి ఉరికించి కొడతాం అనేవాళ్లు కాదు. అది వేరే వ్యవహారం!

అప్పట్లో ఇప్పటిమాదిరిగా వాట్సాప్, ఎక్స్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, సిగ్నల్ వంటి సామాజిక మాధ్యమాలు లేవు కాబట్టి, రాజు ఎవరో అప్పటి ప్రజలకు తెలిసే అవకాశం ఉండేది కాదు. కాబట్టి అన్ని నిజాలు చెప్పేవారు. కానీ ఇప్పుడు పాలకుల మెహర్బానీ, మెరమెచ్చులు, ప్రకటనలు, ప్రలోభాలకు మెయిన్ స్ట్రీమ్ మీడియా సాగిలబడుతున్నప్పటికీ.. సోషల్‌మీడియా మాత్రం ఒళ్లంతా కళ్లు చేసుకుని, మేడే కూడా సెలవు తీసుకోకుండా.. 24 గంటలూ ఉచిత సమాచార శ్రమదానం చేస్తోంది.

ఎక్కడో మారుమూల ఏజెన్సీలో గ్రామంపై పులిదాడి వీడియోను.. ఒకే ఒక్క నిమిషంలో సోషల్‌మీడియా ద్వారా, ప్రపంచానికి తెలిసిపోతున్న కాలమిది! అలాంటిది ఒక సీఎం..అందునా కేవలం ఆయనను చూసే ఒక జాతీయ పార్టీని గెలిపించిన ప్రజలకు.. ఆయన ఉదయం ఐదు గంటలకు, సెక్యూరిటీ కళ్లుగప్పి సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుని వెళితే, అంతపెద్ద మహానగరంలో ఎవరి కంటికీ కనపడకుండా ఉంటుందా? ఆ అసాధారణ దృశ్యం, ఒక్క సెల్‌ఫోన్ కంటికి చిక్కకుండా పోతుందా? లేదు కదా? మరి బీఆర్ఎస్ ఉత్తరాధికారి కేటీఆర్.. తెలంగాణ సీఎం రేవంత్‌పై, అంత పెద్ద ఆరోపణ ఎలా చేయగలిగారన్నదే, ఇప్పుడు అనుమానంతో కూడిన ఆశ్చర్యం!

సీఎం రేవంత్ ఉదయం 5 గంటలకు సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుని మైహోం బూజాకు వెళతారన్న, కేటీఆర్ ఆరోపణ లో సత్యమెంతో చూద్దాం. సీఎం రేవంత్ ఉదయం ఐదుగంటలకు అక్కడకు వెళ్లి ఏం పనిచేస్తారు? సాగర్ సొసైటీలో అంత సేపు ఏం చేస్తారు? ప్రైవేట్ కారులో ఎక్కడికి వెళతారు? అసలు ఎవరీ రేఖలు.. తారలు.. వాణిలు? అన్న కేటీఆర్ ఆరోపణలు.. రంధ్రాన్వేషణ పక్కకు పెడితే.. అసలు భారీ సెక్యూరిటీ మధ్య ఉండే సీఎం, అంత స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంటుందా అన్నదే ప్రశ్న.

నిజానికి ముఖ్యమంత్రులు, హోంమంత్రులకు మిగిలిన వారితో పోలిస్తే ఎక్కువ సెక్యూరిటీ ఉంటుంది. ఇక తీవ్ర వాదుల నుంచి ప్రాణభయం ఉన్న వీఐపీలు, సీఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ ఉండే వీఐపీలు సాధారణ నాయకుల మాదిరిగా, సెక్యూరిటీ లేకుండా బయటకు వెళ్లడం దుర్లభం.సహజంగా ఒక సాధారణ మంత్రి, ఎమ్మెల్యే సెక్యూరిటీని విడిచిపెట్టి వెళ్లిపోతే, ఆ సమాచారాన్ని వారి గన్‌మెన్లు క్షణాల్లో హెడ్‌క్వార్టర్‌కు అందిస్తారు. దానితో ఇంటలిజన్స్ ఐజి, ఏడీజీ అప్రమత్తం అవుతారు. పైగా.. ఈ సమాచారం వివిధ వర్గాల ద్వారా కొద్ది గంటల తర్వాత, మీడియాకు చేరుతుంది. అసలు తెలంగాణ సీఎం సీఎస్ఓగా ఉన్న ఎస్పీ, సెక్యూరిటీ లేకుండా సీఎంను బయటకు అనుమతించరు. సీఎంఎస్‌జీ అధీనంలో ఉండే సీఎం రేవంత్ ఇంటి చుట్టూ, షిఫ్టుల వారీగా సెక్యూరిటీ ఉంటుంది. వారికి సీఎస్ఓలు నేతృత్వం వహిస్తారు. ఇలాంటి కట్టుదిట్టమైన పరిస్థితిలో.. రేవంత్‌రెడ్డి మునుపటి మాదిరిగా, స్వేచ్ఛా విహంగంలా బయట తిరగడ ం దుర్లభం అని స్పష్టమవుతోంది.

అయితే రేవంత్‌రెడ్డి వ్యవహారాలకు సంబంధించిన ఫొటోలు, తనదగ్గర ఉన్నాయని బాంబు పేల్చిన కేటీఆర్..అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న కీలక సమయంలో, వాటిని మీడియాకు ఎందుకు విడుద ల చేయలేదు? పోనీ మీడియాకు విడుదల చేయకపోయినప్పటికీ.. బీఆర్ఎస్ అనుబంధ మీడియాలో ఎందుకు ప్రచురించలేదన్న ప్రశ్నలు, సహజంగానే తెరపైకి వస్తున్నాయి. దానికి ముహూర్తాలు, వారాలు, వర్జ్యాలు చూడటం ఎందుకు?

డిజిటల్ న్యూస్ పేపర్

మంగళవారం 18, మార్చి 2025

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 18, మార్చి 2025

## మార్షల్స్‌తో వైసీపీ సభ్యులను సభకు తీసుకురండి

- వారంతా ఆరోపణలు చేసి పారిపోతున్నారు
- చేయని తప్పునకు చంద్రబాబుని జైల్లో పెట్టారు
- తమ తప్పులు బయటపడతాయనే చర్చ నుంచి పారిపోతున్నారు
- మండలిలో వైసీపీ సభ్యుల వాకౌట్‌పై మంత్రి లోకేష్ మండిపాటు

**అమరావతి, మహానాడు:**

వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు ప్రయత్నించారని, ఇప్పుడు ఆ అంశంపై చర్చలో పాల్గొనకుండా ఆరోపణలు చేసి పారిపోతున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. శాసనమండలిలో 2019-24 మధ్య అవినీతి, అక్రమాలపై చర్చను నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. అందరూ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. 2019-24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల అంశంపై చర్చకు అనుమతిస్తూ మండలి ఛైర్మన్ ఆదేశాలు జారీచేశారు. బీఏసీలో వైసీపీ సభ్యులు అంగీకరించారు. చర్చలో వైసీపీ సభ్యులు 2014-19 మధ్య జరిగిన పాలనపై ఆరోపణలు చేసి.. ఇప్పుడు సమాధానం ఇస్తుండగా వాకౌట్ చేస్తున్నారు.

వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతారు. సమాధానానికి సమయం ఇవ్వరు. మేం సమాధానం ఇచ్చే సమయంలో సభలో ఉండరు. ఇది మొదటిసారి కాదు.. పదేపదే ఈ విధంగా చేస్తున్నారు. ఇది సరికాదు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతంలో మార్షల్స్ ను పెట్టి సభను నడిపించిన పరిస్థితి. ఇప్పుడు మార్షల్స్ ను పెట్టి బయట ఉన్న సభ్యులను సభకు తీసుకురావాలని ఛైర్మన్ ను కోరారు. ఆ అధికారం ఛైర్మన్ కు ఉందన్నారు. 2014-19 మధ్య పాలనపై వైసీపీ సభ్యులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కేసులు పెట్టారో చూశాం. చేయని తప్పునకు చంద్రబాబుని 53 రోజుల పాటు జైల్లో



పెట్టారు.

మొదట రూ.3వేల కోట్ల కుంభకోణం అన్నారు, తర్వాత రూ.300 కోట్లని, తర్వాత రూ.27 కోట్లు అని అన్నారు. చేయని తప్పునకు జైలుకు పంపారు. అచ్చెన్నాయుడుని, ధూళిపాళ్ల నరేంద్రని, కొల్లు రవీంద్రని, నారా యణని.. అందరినీ ఇబ్బంది పెట్టారు. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. ఇవన్నీ బయటపడతాయని భయపడుతున్నారా? ఆరోపణలు చేసి పారిపోతున్నారు.అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మా నాయకులు చేయని తప్పులకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు యత్నించారు. కేసులపై చర్చించాలి. నాపైనా 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. హత్నాయత్నం కేసు పెట్టారు. చర్చకు లేకుండా పారిపోయారు. ఇది సరికాదన్నారు. మార్షల్స్ ను పెట్టి బయటకు వెళ్లిన వైసీపీ సభ్యులను లోపలికి తీసుకురావాలని ఛైర్మన్ ను కోరారు.

## చంద్రబాబు నిర్ణయాలు రాయలసీమ రైతుల పాలిట శాపాలు!

- రాయలసీమ ఎత్తిపోతలకు సమాధి కడుతున్న చంద్రబాబు
- సీమరైతుల కన్నీటి కష్టాలకు బాబు అసమర్థతే కారణం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం

**నెల్లూరు, మహానాడు:**

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కి సీఎంగా వైయస్ జగన్ శ్రీకారం చుడితే, చంద్రబాబు సమాధి కడుతున్నారని వైయస్ఆర్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టిసీమ రైతుల కన్నీటి కష్టాలకు చంద్రబాబు స్వార్థ రాజకీయ ప్రయోజనాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పంపకాల వ్యవహారంలో ఏపీకి కళ్ళముందే అన్యాయం జరుగుతున్నా కూడా తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని అసమర్థుడు చంద్రబాబని మండిపడ్డారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

చంద్రబాబు ఎప్పుడు సీఎంగా తీసుకుంటున్న నిర్ణయాలు రాయలసీమ రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. వైయస్ జగన్ సీఎంగా ఉండగా రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాకు సాగునీరు, మంచినీరు అందించాలనే ఆలోచనతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. నేడు చంద్రబాబు దానిని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. రాయలసీమ రైతులపై కక్ష తీర్చుకునేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు తాను రాయలసీమ నుంచి వచ్చానని, 15 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకోవడమే తప్ప, సీమ రైతాంగానికి మేలు చేసే చర్య ఒక్కటీ కూడా చేపట్టలేదు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రయత్నించడం లేదు.

రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో వైయస్ జగన్‌కి మంచి పేరొస్తుందనే ఈర్ష్యాద్వేషాలతో చంద్రబాబు రగిలిపోతున్నారు. పోలవరం, ఆల్మట్టి, ప్రాజెక్ట్‌ల విషయంలోనూ ఇలాగే రాజీ పడి రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశాడు. హక్కుగా దక్కిన నీటిని వాడుకోవడానికే తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.3,825 కోట్ల వ్యయంతో 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తద్వారా చెన్నైకి 15 టీఎంసీలు సరఫరా చేయడం, ప్రాజెక్టుల కింద 9.6 లక్షల ఎకరాలకు సాగునీరందించాలన్నది లక్ష్యం.

ఈ నేపథ్యంలో రాయలసీమ ఎత్తిపోతల పథకంను అడ్డుకునేందుకు చంద్రబాబు అడుగడుగునా కుట్రలకు పాల్పడ్డాడు. ఎన్జీటీ (చెన్నై)



బెంచ్‌లో తెలంగాణ ప్రాంతంలోని రైతులతో టీడీపీ నేతలు అప్పట్లో రిట్ పిటిషన్ దాఖలు చేయించారు. దీనిపై విచారించిన ఎన్జీటీ పర్యావరణ అనుమతి తీసుకుని, ఎత్తిపోతల పనులు చేపట్టాలంటూ 2020 అక్టోబర్ 29న ఆదేశించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు అవసరాలను సరిగ్గా వివరించక పోవడం, మొదటి నుంచి ప్రాజెక్ట్‌పై వ్యతిరేకతతో ఉన్న చంద్రబాబు నిర్లక్ష్య వైఖరి ఫలితంగా పనులు నిలిపివేయడంతో పాటు అక్కడి పరిస్థితిని పూర్వ స్థితికి తేవాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ గతనెల 27న ఆదేశించింది. 10 నెలల చంద్రబాబు పాలనలో రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిపోయింది. మనకు హక్కుగా కేటాయించిన 44 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటున్నామని ఈఏసీ ఎదుట సమర్థంగా వాదనలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసింది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 798 అడుగుల్లోనే తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని తోడేస్తోంది. 800 అడుగులకు చేరగానే సాగుకు నీటిని విడుదల చేసుకుంటున్నారు. అయినా కూడా చంద్రబాబు ప్రభుత్వం దీనిపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా చోద్యం చూస్తూ కూర్చుంది.

## శ్మశానవాటికలోని అక్రమ డంపింగ్, అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

- న్యాయం కోసం మల్కాజిగిరి ఎమ్మెల్యే చెత్తలో నిరసన!

**మల్కాజిగిరి, మహానాడు:** మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని శ్మశాన వాటికలోని అక్రమ డంపింగ్ యార్డును తొలగించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన డంపింగ్ యార్డులోని చెత్తలోనే కూర్చొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. "స్టాప్ ఇల్లీగల్ డంపింగ్ ఇన్ హిందూ గ్రేవ్ యార్డ్" అనే నినాదంతో దాదాపు నలభై కాలనీల ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించాం. ప్రజా ఆరోగ్యాన్ని, హిందూ సంప్రదాయాలను మనోభావాలను లెక్క చేయకుండా ఇష్టానుసారం అధికారులు వ్యవహరించడం సమంజసం కాదు.

డంపింగ్ యార్డులో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన భయంకర మైన చెత్త వల్ల ప్రజాజీవనం కాలుష్యభరితమై, చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యాలు ప్రశ్నార్థకంగా మారాయి.



భూగర్భ జలాలు కాలుష్యమవు తున్నాయని, పర్యావరణం పూర్తిగా కాలుష్య భరితంగా మారింది. అధికారులు కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా పనిచేయడం మానుకోవాలి. ఈ సమస్య పరిష్కారం అయ్యేంతే వరకు ప్రతిరోజూ ధర్నా నిర్వహిస్తా మని, అవసరమైతే అల్వాల్ బల్దియా కార్యాలయాన్ని ముట్టడిస్తాం. ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లి, అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటాం.

## పర్యాటక అభివృద్ధిలో అన్ని జిల్లాలకు సముచిత స్థానం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**అమరావతి, మహానాడు:**

రాష్ట్ర వ్యాప్తంగా టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు ఉన్నాయని, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో ఎకో టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, పర్యాటక అభివృద్ధిలో అన్ని జిల్లాలకు సముచిత ప్రాధన్యత కల్పిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

సోమవారం శాసన సభలో శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో పర్యాటక అభివృద్ధిపై



ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జూపల్లి సమాధానం ఇచ్చారు. ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్‌లో పర్యావరణ (ఎకో) పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఉమ్మెడ గ్రామ సమీపంలోని 1.20 ఎకరాల భూమిని, అదేవిధంగా జలాల్ పూర్ గ్రామ పరిధిలోని మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం తెలంగాణ అటవీ అభి వృద్ధి సంస్థకు అప్పగించిందని పేర్కొన్నారు. తదుపరి పనులను తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చేపట్టనుందని మంత్రి వెల్లడించారు.

## ఐటీ కంపెనీలకు భూతంలా కనిపించిన 'వైసీపీ'!

- జగన్ పాలనలో కంపెనీలను తరిమేశారు
- కూటమి పాలనలో ఐటీ పెట్టుబడులకు కృషి
- త్వరలో శుభవార్తలు వింటాం
- శాసన మండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

**అమరావతి, మహానాడు:**

వైసీపీ పాలనలో ఐటీ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేశారని, కూటమి పాలనలో పెద్ద ఎత్తున ఐటీ పెట్టుబడులకు కృషిచేస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీఐఐసీ ద్వారా విశాఖ పట్నంలో ఐటీ పార్క్‌ల్లో పరిశ్రమలు స్థాపించడానికి ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన భూములు, కంపెనీల వివరాలు, ఉద్యోగ నియామకాలు, పీఎఫ్ వంటి ఒప్పంద నిబంధనలపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విశాఖ పట్నంలో ఐటీ పార్క్ ల్లో ఏపీఐఐసీ ద్వారా 54 కంపెనీలకు 295.68 ఎకరాలు కేటాయించాం... ఐటీ సెక్టార్ చాలా కీలకం. త్వరలోనే మంచి ప్రకటనలు రాబోతున్నాయి. భూ కేటాయింపుల విషయానికి వస్తే.. ఐటీ కంపెనీలకు ప్రధానంగా భూములు కేటాయించామని తెలిపారు. ఐటీ కంపెనీలను పెద్దఎత్తున ప్రోత్సహించాం. అనవసరమైన నిబంధనలు పెట్టలేదు. అవుట్ సోర్సింగ్ కంపెనీల విషయానికి వస్తే బీపీవోస్ ను ఒకరకంగా చూస్తాం. రెండోది గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ కోసం(జీసీసీ).. అంటే ఫార్చ్యూన్-2500 కంపెనీలకు ఒకరకమైన ప్రోత్సహకాలు అందిస్తాం. మూడోది దేశంలోని పెద్ద కంపెనీలు.. టీసీఎస్, కాంద్యుయెంట్, విప్రో, ఇన్ఫోసిస్, డెలాయిట్ లాంట సంస్థలకు ఒకరకమైన కేటాయింపులు చేస్తాం.

డెవలపర్స్ కూడా ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా భూముల కేటాయింపు, వాటి వినియోగం జరుగుతుంది. మేం టాప్-100 డెవలపర్స్, ఐటీ కంపెనీలు, బీపీవోస్‌తో సంప్రదింపులు చేస్తున్నాం. ఫార్చ్యూన్-2500 కంపెనీలతో సంప్రదింపులు చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో కొంత భూమిలో కమర్షియల్ యాక్టివిటీస్ కు కూడా అనుమతిస్తున్నాం. కంపెనీలకు ఇంటిగ్రేట్ యాక్టివిటీ, ఫుడ్ కోర్ట్స్, బేసిక్ రీటైలింగ్ యాక్టివిటీస్ ఉంటాయి. ఇందుకోసం అనుతిస్తాం.



వైసీపీ పాలనలో ఐటీ కంపెనీలను తరిమేశారు

జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఐటీ రంగం తిరోగమనంలో ఉంది. పీపీఏలను రద్దు చేశారు. నాపై కోపం ఉంటే తీర్చుకోవాలి. రాష్ట్రాన్ని నష్టపరిచారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఒక ఫార్చ్యూన్-500 కంపెనీ యజమానిపై వైసీపీ ఎంపీలు పార్లమెంట్ సాక్షిగా ఆరోపణలు చేశారు. దీంతో ఆ కంపెనీ ఇబ్బంది పడింది. వైజాగ్ వదిలి పారిపోయింది. ఇప్పుడు 54 కంపెనీల్లో 41 కంపెనీలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. 11,496 మంది పనిచేస్తున్నారు. వారికి పీఎఫ్ చెల్లిస్తున్నారు. ఐటీ కంపెనీల రాకపై రాబోయే రోజుల్లో సంచలన ప్రకటనలు చూస్తారు. కేవలం హైదరాబాద్ తోనే కాదు.. జైపూర్, భువనేశ్వర్ తో మనం పోటీపడుతున్నాం.

ఏపీలో పెద్దఎత్తున ఐటీ పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై దృష్టిసారిస్తున్నాం. కంపెనీలను పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కంపెనీలు రియల్ ఎస్టేట్ చేయలేవనే విషయాన్ని గమనించాలి. టీసీఎస్ విషయంలో ఇప్పటికే ప్రకటన చేశాం. త్వరలోనే వైసీపీ ఖాళీగా పెట్టిన మిలీనియం టవర్స్‌లోకి వస్తున్నారు. వారికి భూములు కూడా కేటాయిస్తాం. దావోస్‌లో కాగ్నిజెంట్, ఇతర కంపెనీలతో కూడా సంప్రదింపులు జరిపాం. కాగ్నిజెంట్‌పై త్వరలోనే ప్రకటన చేయనున్నామని మంత్రి చెప్పారు.

## ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కమిటీలు

- పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల

**తాడేపల్లి, మహానాడు:** ప్రతీ నియోజకవర్గంలోనూ వైఎస్సార్‌సీపీ కమిటీలు వెంటనే పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో సజ్జల టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు, రీజనల్ కోఆర్డినేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శులు, ఇతర ముఖ్యనేతలు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కమిటీల విషయంలో ఎటువంటి జాప్యం జరగకూడదని సజ్జల ఆదేశించారు.

ఇందుకోసం జనరల్ సెక్రటరీలు, రీజనల్ కో ఆర్డినేటర్లు, కేంద్ర కార్యాలయం నుంచి ఇంచార్జులు అందరూ అందుబాటులో ఉంటారన్నారు. కమిటీల విషయంలో జాప్యం జరగడానికి వీల్లేదని ఇప్పటికే వైఎ?స్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ స్పష్టం చేసిన సంగతిని సజ్జల ఈ సందర్భంగా గుర్తు చేశారు. కమిటీల ఏర్పాటుపై సీరియస్‌గా దృష్టిపెట్టాలని, జిల్లా అధ్యక్షులు వెంటనే వీటిపై స్పందించాలని సజ్జల సూచించారు. ప్రజా పాలనను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష



స్పందన వచ్చిందని, పార్టీకి సంబంధించి రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వం సమిష్టిగా పని చేసి అన్ని కార్యక్రమాలను విజయవంతం చేశారని సజ్జల అభినందించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అధినేత వైఎస్ జగన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారని తెలిపారు.

## అన్నా క్యాంటీన్‌లో అల్పాహారాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే

**గుంటూరు, మహానాడు:** ప్రతి పేదవాడు కడుపునిండా భోజనం తినాలి అనే సంకల్పంతో స్థాపించిన అన్నా క్యాంటీన్‌లు సంతృప్తికరంగా నడుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం శివారు ప్రాంతాల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మిర్చి యార్డు వద్దనున్న అన్న క్యాంటీన్ ను సందర్శించి అక్కడ ప్రజలతో ముచ్చటించి, రైతులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. క్యాంటిన్ నిర్వహణ గురించి వాకబు చేశారు. అన్న క్యాంటీన్ లో అల్పాహారం మొదలు భోజనం వరకు చాలా బాగున్నాయని ప్రజలు ఎమ్మెల్యే వద్ద హర్షం వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకు స్థానిక రైతు కూలీలతో పాటు ఇతర జిల్లాల నుండి రైతులు వస్తుంటారని, దానికి అనుగుణంగా రోజువారి ఇచ్చే టోకెన్ల సంఖ్యను పెంచే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, ఆడగా పద్మావతి, చెంబేటి మణికుమారి,చంద్రగిరి బాబు,



మహబూబ్ సుభాని, శివ, తుమ్మల నాగేశ్వరరావు,ఖాసిం సైదా, బాబు, మామిడి రామారావు, బుడే, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మేధాశక్తి, నైపుణ్యానికి భారత్ పెట్టింది పేరు

- నాగ వెంకట సత్యేంద్ర

**విశాఖపట్నం, మహానాడు:**

భారతీయతను ముందుకు తీసుకువెళ్లాలి.. ఏపని చేసినా భారత దేశం గర్వించేలా చేయాలని ట్రినీటిల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ నాగ వెంకట సత్యేంద్ర అన్నారు. ఇక్కడి అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) మహానగర్ సాంఘిక్ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహానగర్‌లోని స్వయంసేవకులు పూర్ణగణవేష్‌తో హాజరయ్యారు. తొలుత శారీరిక్, ఘోష్ ప్రదర్శనలు జరిగాయి. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యేంద్ర మాట్లాడారు. భారతదేశం మేధాశక్తి, నైపుణ్యానికి పెట్టింది పేరు... ప్రపంచంలో భారతదేశానికి కీర్తిప్రతిష్ఠలు







ఉన్నాయన్నారు.

ముఖ్యవక్తగా పాల్గొన్న సంఘ్ ఆంధ్రప్రదేశ్ సహప్రాంత కార్యవాహ మాలపాటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆర్.ఎస్.ఎస్ కు

వందేళ్ల ఉత్సవాలు చేసుకుంటున్నాము.. దేశంలో ధర్మానికి హాని జరిగినపుడు మన కర్తవ్యాన్ని గుర్తించాలని గీత చెప్పింది. ధర్మరక్షణకోసం ఆర్.ఎస్.ఎస్ వందేళ్లుగా పని చేస్తోందని తెలిపారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. ప్రతీ వ్యక్తికి దేశభక్తి, సంస్కృతి పట్ల నిష్టవుండాలి. దేశానికి పూర్వవైభవం తీసుకురావాలి. తనకు జన్మనిచ్చిన దేశం కోసం తానే పాటుపడాలి... ఇదే విషయాన్ని ఆర్.ఎస్.ఎస్ చెబుతుంది. దేశం కోసం మనం ఏమిచ్చామన్నదే ముఖ్యం. వ్యక్తి నిర్మాణంతోనే సంఘ నిర్మాణం జరుగుతుంది.. ఎంతో మంది విదేశీయులు మన దేశాన్ని



పాలించారు...దోచుకున్నారు.... రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలది.. పాలించేవారు దుర్మార్గులైతే రాజ్యాంగరక్షణ బాధ్యత ఎవరిది? చరిత్రలో దేశాన్నికాపాడే మహాయోధులను తోటివారే దెబ్బ తీశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి దేశాన్ని దెబ్బతీసేవారిని ఇప్పటికీ చూస్తున్నాం.. దేశాన్ని పాలించేవారికి దేశభక్తి వుండాలా వద్దా?

ప్రపంచంలోని అనేక సవాళ్లకు హిందూత్వమే సమాధానం. విదేశాల్లో పుట్టే పిల్లలకు వారి తండ్రిఎవరో తెలీదు.

మనదేశంలో ఉన్న కుటుంబ వ్యవస్థ ఒక అద్భుతమైన ప్రయోగశాల. అమెరికా నేడు కుటుంబ వ్యవస్థను కోరుకుంటోంది..

మన సంస్కృతిపట్ల, సంప్రాదాయాల పట్ల మన భావితరాలకు తెలియజెప్పాలి. స్వదేశీ భావన ఉపన్యాసాలతో సాధ్యంకాదు.. కార్యాచరణ అవసరం... మతం పేరుతో భూభాగాన్ని పోగొట్టుకున్నాం. మళ్లీ ప్రాంతీయ బేధాలు సృష్టించి విడగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మనదేశంలో స్త్రీకి స్వాతంత్రం లేదని సోషల్ మీడియాలో నూరిపోస్తున్నారు. స్త్రీని ప్రతి దశలోనూ కాపాడే వ్యవస్థ మనకుంది. సమాజంలో వస్తోన్న ప్రతి వితండవాదానికి సమాధానం మన దగ్గర వుంది. వారికి ఎలా చెప్పాలో అలా చెప్పాలి. ఒకదేవాలయం మీద ఆధారపడి పది మంది జీవిస్తున్నారు. కనిష్ఠంగా పది మంది నుంచి గరిష్ఠంగా 20 వేల ఉద్యోగాలు ఇచ్చే దేవాలయాలున్నాయి. తిరుమల వల్ల ఆర్టీసీ డిపో బతుకుతోంది. కుంభ మేళాలో మూడు లక్షల కోట్ల టర్నోవర్ జరిగింది. దేవాలయాల వల్ల ఎకనమిక్ రివల్యూషన్లు వచ్చాయి.

### దేవాలయాలు హిందూ సమాజాన్ని మేలుకొలిపే శక్తి కేంద్రాలు.

పర్యావరణ సమతుల్యత మన సంస్కృతిలోనే వుంది.. నదులను తల్లులుగా భావిస్తాము. వాటిని కాపాడుకుంటాం.. పూజలు నిర్వహిస్తాం. లేనిపోని రాజకీయ స్వార్థాల కోసం దేశాన్ని విచ్ఛిన్నం చేసే వారి పట్ల అప్రమత్తంగా వుండాలి. దేశ విభజనకు పదేళ్లు ముందు ఆర్.ఎస్.ఎస్ వుండి వుంటే , పాకిస్థాన్ విడిపోయి వుండేది కాదు. స్వయంసేవక్ గా వుండటం ఈశ్వరీయ కార్యం.. మనమంతా గర్వపడాలి... కర్తవ్యంతో ముందుకు వెళ్లాలి.

ఈ కార్యక్రమంలో మహానగర సంఘచాలక్ పీవీ నారాయణ రావు, సహ సంఘచాలక్ బీసీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 18, మార్చి 2025 ||


## డీలిమిటేషన్ అంశంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదు : కేటీఆర్



హైదరాబాద్, మహానాడు: డీలిమిటేషన్ అంశంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదు... సోమవారం జరిగిన అఖిలపక్ష సమావేశ నిర్వహణపై ప్రభుత్వానికి స్పష్టత లేదు... కాంగ్రెస్ పార్టీ వైఖరిపైన వారికే స్పష్టత లేదని కేటీఆర్ విమర్శించారు. దేశంలో అందరికంటే ముందు డీలిమిటేషన్ వల్ల తెలంగాణకి, దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే నష్టాల గురించి మాట్లాడింది మా పార్టీ అని ఆయన అన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. డీఎంకే పార్టీ కన్నా ముందే చాలా కాలం నుంచి డీలిమిటేషన్ వలన దక్షిణాదికి జరగబోయే నష్టం గురించి జాతీయ వేదికల పైన మాట్లాడుతున్నాం. దేశ ప్రయోజనాల కోసం పాటుపడిన దక్షిణాది రాష్ట్రాలకు డిలిమిటేషన్ విధానం వలన నష్టం జరుగుతుందని చెప్తూ వస్తున్నాం. డీలిమిటేషన్ పైన జరిగే నష్టాల పైన కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా చెప్తాం. డీలిమిటేషన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం పైన పోరాడుతాం. డీలిమిటేషన్ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదు... డిలీమిటేషన్ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఉన్న బాధ్యత ఏమిటో చెప్పాలి. 22న చెన్నైలో జరిగే డిఎంకె సమావేశానికి హాజరవుతాం. ఈ సమావేశానికి పార్టీ తరఫున నేను హాజరై పార్టీ విధానాన్ని బలంగా వినిపిస్తా..



## శ్రీవారిని దర్శించుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుమల, మహానాడు:

తిరుమల శ్రీనివాసుని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతి, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న అనంతరం, తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తుల మధ్య అన్నప్రసాద స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, తిరుమల శ్రీ వేంక టేశ్వరుని కృపా కటాక్షాలు సర్వజనులకు లభించాలని ఆకాంక్షించారు. దేవస్థానం వృద్ధి, భక్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన దంపతులను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు రంగనాయక మండపములో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

## భారీ ఎత్తున అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం

- ప్రపంచంలో నెం.1 రాజధానిగా అమరావతిని నిలిపేందుకు 'కూటమి' కంకణం
- 5 జిల్లాల్లో 121 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్

అమరావతి, మహానాడు:

ఏపీ ప్రభుత్వం మరో భారీ ప్రాజెక్టుకు సంకల్పించింది. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనకు అనుగుణంగా భారీ స్థాయిలో అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అమరావతి ఓఆర్ఆర్ మొత్తం 189.9 కిలోమీటర్ల పొడవు ఉండనుంది. తెలంగాణలోని హైదరాబాద్ ఓఆర్ఆర్ కంటే ఇది ఎక్కువ పొడవు అని తెలిసిందే. అమరావతి ఓఆర్ఆర్ భూ సేకరణకు అధికారులను నియమించి, మరోవైపు ఎన్ హెచ్ ఏఐ ప్రతిపాదిత ఎలైన్ మెంట్లో ఏపీ ప్రభుత్వం మార్పులు చేర్పులతో ఆమోదం తెలపనుంది. పల్నాడు, గుంటూరుతో పాటు ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూ సేకరణకు జేసీలను అధికారులుగా నియమించారు.

ఐదు జిల్లాల్లోని 23 మండలాల్లో, 121 గ్రామాల మీదుగా ఈ ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుంది. అమరావతి ఓఆర్ఆర్ ఏ జిల్లాల్లో ఏ గ్రామాల నుంచి వెళ్తుందని స్థానిక ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఆ జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలివి.

### గుంటూరు జిల్లాలో అమరావతి ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు

మంగళగిరి మండలంలో కాజ, చినకాకాని, గుంటూరు తూర్పు మండలంలో గుంటూరు, బుడంపాడు, ఏటుకూరు, గుంటూరు పశ్చిమ మండలంలో పొత్తూరు, అంకిరెడ్డిపాలెం. మేడికొండూరు మండలంలో సిరిపురం, వరగాని, వెలవర్తిపాడు, మేడికొండూరు, డోకిపర్రు, విశదల, పేరేచర్ల, మందపాడు, మంగళగిరిపాడు, తాడికొండ మండలంలో పాములపాడు, రావెల. దుగ్గిరాల మండలంలో చిలువూరు, ఈమని, చింతలపూడి, పెనుమూలి, కంఠంరాజు కొండూరు, పెద కాకాని మండలంలో నంబూరు, అనుమర్లపూడి, దేవరాయబొట్లపాలెం,



తెనాలి మండలంలో కొలకలూరు, నందివెలుగు, గుడివాడ, అంగలకుదురు, కఠేవరం, సంగం జాగర్లమూడి. కొల్లిపర మండలంలో వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, కుంచవరం, అత్తోట. చేబ్రోలు మండలంలో గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, సుద్దపల్లి, శేకూరు. వట్టిచెరుకూరు మండలంలో కొర్నెపాడు, అనంతవరప్పాడు, చమళ్లమూడి, కుర్నూతల.

### పల్నాడు జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు

పెదకూరపాడు మండలంలో ముస్సాపురం, పాటిబండ్ల, తాళ్లూరు, లింగంగుంట్ల, జలాల్పురం, కంభంపాడు, కాశిపాడు. అమరావతి మండలంలోని ధరణికోట, లింగాపురం, దిడుగు, నెమలికల్లు.

### ఎన్టీఆర్ జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు.

వీరులపాడు మండలంలోని పొన్నవరం, జగన్నాథపురం, తిమ్మాపురం, గూడెం మాధవరం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, అల్లూరు, నరసింహారావు పాలెం. కంచికచర్ల మండలంలోని కంచికచర్ల, మున్నలూరు, మొగులూరు, పెరెకలపాడు, గొట్టుముక్కల, కునికిన పాడు. జి.కొండూరు మండలంలోని జి.కొండూరు, దుగ్గిరాలపాడు, పెట్రంపాడు, కుంటముక్కల, గంగినేనిపాలెం, కోడూరు, నందిగామ, మైలవరం మండలంలోని మైలవరం, పొందుగుల, గణపవరం.

### కృష్ణా జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు

గన్నవరం మండలంలోని సగ్గురు ఆమని, బుతుమిల్లిపాడు, బల్లిపర్రు. బాపులపాడు మండలంలోని బండారుగూడెం, అంపాపురం. ఉంగుటూరు మండలంలోని పెద్దఅవుటపల్లి, తేలప్రోలు, వెలినూతల, ఆత్కూరు, పొట్టిపాడు, వెల్దిపాడు, తరిగొప్పుల, బొకినాల, మానికొండ, వేంపాడు, కంకిపాడు మండలంలోని మారేడుమాక, కొణతనపాడు, దావులూరు, కోలవెన్ను, ప్రొద్దుటూరు, చలివేంద్రపాలెం, నెప్పల్లె, కుందేరు. తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు, నార్త్ వల్లూరు, చినపులిపాక, బొడ్డపాడు, సౌత్ వల్లూరు.

### ఏలూరు జిల్లాలో ఓఆర్ఆర్ వెళ్లే ప్రాంతాలు

ఆగిరిపల్లి మండలంలోని బొడ్డనపల్లె, గరికపాటివారి కండ్రిక, ఆగిరి పల్లి, చొప్పరమెట్ల, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, నరసింగ పాలెం, కృష్ణవరం, సగ్గూరు, సురవరం, కల్లటూరు.




జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 18, మార్చి 2025


## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం

- ఈ నెల 24 నుండి అమలు

**అమరావతి, మహానాడు:** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు



శ్రీవారి దర్శనాన్ని టీటీడీ కల్పించనుంది. ఈ విధానం మార్చి 24 నుండి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి తెలంగాణ ప్రజా ప్రతినిధుల నుండి సిఫార్సు లేఖలను ఆది, సోమ, వారాల్లో మాత్రమే స్వీకరిస్తారు. (సోమ, మంగళవారం దర్శనాలకు).

అదేవిధంగా రూ. 300 దర్శనం టికెట్లకు సంబంధించి సిఫార్సు లేఖలను బుధ, గురు వారాలలో మాత్రమే స్వీకరించనున్నట్టు(ఏ రోజు కా రోజు దర్శనం, ఒకరికి ఒక సిఫార్సు లేఖను మాత్రమే.. ఆరుగురికి మించకూడదు) తెలిపారు. ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఆంధ్ర ప్రజా ప్రతినిధుల నుండి స్వీకరిస్తున్న సిఫార్సు లేఖలు ఇకపై శనివారం (ఆదివారం దర్శనం కొరకు) స్వీకరిస్తారు. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలను, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో ఉంచుకుని సుదీర్ఘంగా చర్చించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం టీటీడీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని టీటీడీకి సహకరించవలసిందిగా కోరడమైనది.



## ఏఐ సాయంతో గుండె జబ్బులు నిర్ధారణ

- సిర్కాడియావీ యాప్‌ను రూపొందించిన 14 ఏళ్ల సిద్ధార్థ్
- విద్యార్థిని అభినందించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, మహానాడు:**
సీఎం చంద్రబాబును ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల అనే బాలుడు కలిశాడు. ఏడు సెకెన్లలోనే గుండె జబ్బులు నిర్ధారించేందుకు ఏఐ సాయంతో సిర్కాడియావీ యాప్‌ను సిద్ధార్థ్ ఇటీవల రూపొందించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు పరీక్షలు కూడా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఎం సిద్ధార్థ్‌ను కలిసేందుకు ఆహ్వానించారు. సిద్ధార్థ్ ప్రొఫైల్ తెలుసుకుని అభినందించారు. దాదాపు అరగంట పాటు అతనితో సీఎం ముచ్చటించారు. వైద్యం రంగంలో సేవలందించేలా ఆవిష్కరణలు చేయాలని ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి ఎక్కడున్నా అద్భుతాలు సృష్టించాలని తాను ఎప్పుడూ కలలు కంటుంటానని, వాటిని సిద్ధార్థ్‌లాంటి విద్యార్థులు సాధించిన విజయాలు తనకు ఎంతో సంతృప్తినిస్తాయని అన్నారు.

ఏఐలో మరిన్ని ఆవిష్కరణలు చేయాలని సీఎం సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. సిద్ధార్థ్‌ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. అనంతపురానికి చెందిన వీరి కుటుంబం 2010లో అమెరికాలో స్థిరపడింది. సీఎంను కలిసిన వారిలో సిద్ధార్థ్ తండ్రి మహేష్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నారు.




## ‘నియోజకవర్గాల పునర్విభజన’లో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం కావాలి

- సైంటిఫిక్ విధానం కనుగొనేవరకు వాయిదా అవసరం
- అఖిలపక్ష సమావేశంలో నేతలు

**హైదరాబాద్, మహానాడు:** దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యంగా ఉండేలా నియోజకవర్గాల పునర్విభజన ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనపై సోమవారం అసెంబ్లీ ఆవరణలోని కమిటీ హాల్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సిపిఐ, ఎంఐఎం, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, రిపబ్లిక్ కన్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు ప్రధానంగా తెలంగాణ నష్టపోతుంది ఈ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై చర్చలు, ఆలోచనలు చేయాలని సమావేశానికి హాజరైన రాజకీయ పక్షాలను డిప్యూటీ సీఎం కోరారు.

మన గౌరవం, ప్రాధాన్యత కాపాడుకుంటూ భారత దేశంలో మన అందరి పాత్ర ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరిక మేరకు ఈ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ నేతలను సైతం ఆహ్వానించినప్పటికీ వారు ప్రత్యేక రాజకీయ కారణాల తో సమావేశానికి హాజరు కాలేమని తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్లమెంటు సమావేశంలో బిజీగా ఉండడం, ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వారు హాజరు కాలేదని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశానికి హాజరైన నేతలంతా ఇచ్చిన సమాచారం మేరకు భవిష్యత్తులో ఈ అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ప్రణాళిక తయారు చేసుకొనే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం వివరించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఏర్పాటు ను వ్యతిరేకిస్తూ శాసనసభలో చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి అని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

దేశంలో ఆందోళనకు దారి తీయకుండా కొంతకాలం ఇదే విధానం కొనసాగించాలని, నియోజకవర్గాల పునర్విభజన పై కేంద్రం ఆలోచన చేయకపోతే ప్రమాదం ఉందన్న స్పృహ వారికి కలగజేయాలి నీ సీనియర్ నేత జానారెడ్డి అభిప్రాయపడ్డారు. ఒక సైంటిఫిక్ నిర్ణయం వచ్చేవరకు నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతానికి అనుగుణంగా దక్షిణాది రాష్ట్రాల్లోనూ సీట్ల సంఖ్య పెంచాలని సిపిఐ శాసనసభ పక్ష నేత కె.సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓవైపు ఈ అంశంపై పోరాటం చేస్తూ మరోవైపు సైంటిఫిక్ పరిష్కారం కోసం



రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు నిత్యం ఆలోచన చేయాలని కూనంనేని, వెస్లీలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నియోజకవర్గ పునర్విభజనపై జాతీయస్థాయిలో ఒక పాలసీని తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫెడరల్ స్టేట్ అంటే ప్రతి రాష్ట్రానికి సమాన హక్కు ఉండాలి, నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం అభినందనీయమని సిపిఎం మాస్ లైన్ నేత హనుమేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతం ప్రకారం దక్షిణాదిలోను నియోజకవర్గం పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది ప్రాథమిక సమావేశమైనని రాబోయే రోజుల్లో విస్తృతంగా ఈ అంశంపై చర్చ, కార్యక్రమాలు చేపట్టాలని అఖిలపక్ష సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయపడ్డారు.

నియోజకవర్గాల పునర్విభజన వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కమిటీ ఏ నిర్ణయం తీసుకున్న ఆచరణలో పెట్టేందుకు సిద్ధమని సమావేశానికి హాజరైన పార్టీల నేతలు తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఎంఐఎం శాసనసభక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు హనుమేష్, సూర్యం, మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, రిపబ్లిక్ ఆన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సిహెచ్ బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం దుర్గాప్రసాద్, తదితరులు హాజరయ్యారు.





## టీడీపీ కేంద్ర కార్యాలయంలో పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదు

- ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 9 లక్షలు తీసుకొని మోసం
- గచ్చిబౌలిలో కేసు పెట్టినా పట్టించుకోలేదని మొర
- తనకు డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని అభ్యర్థించిన బాధితుడు

**మంగళగిరి, మహానాడు:**
కర్నూలు జిల్లా, కల్లూరు మండలం కల్లూరుకు చెందిన కె.సత్యనారాయణ శెట్టి సోమవారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని గతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న సినీ నటుడు పోసాని కృష్ణమురళి, మహేష్ అనే వ్యక్తులు తన వద్ద నుండి రూ. 9 లక్షలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై గచ్చిబౌలిలో







కేసు పెట్టినా తనకు ఎటువంటి న్యాయం జరగలేదని.. డబ్బులు మోసపోవడంతో ఐదేళ్లనుండి ఇంటికి కూడా పోలేక గుంటూరులో కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నానని.. తనకు ఇప్పుడు చావే శరణ్యమని.. దయ చేసి తనకు రావాల్సిన డబ్బులను పోసాని నుండి ఇప్పించి న్యాయం చేయాలని నేతలు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ లకు అర్జీ ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశారు.

- కర్నూలు జిల్లా, మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన ముల్లా ఖాతూన్ బీ గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 2009 సంవత్సరంలో తుంగభద్రకు వరద వచ్చి తమ ఊరు మునిగిపోగా.. అప్పుడు ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేసిందని.. అయితే తమకు మంజూరైన ఇంటిని వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తన అనుచరుడికి ఇచ్చి తమకు అన్యాయం చేశాడని.. తమ ఇల్లు తమకు ఇప్పించాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- తమ గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మంచినీటి కుళాయిలు, శ్మశానవాటికతో పాటు సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ బిల్డింగ్‌ను నిర్మించాలని పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం లక్కగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ కె. కళావతి, మాజీ ఎంపీటీసీ తదితరులు నేడు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- కబ్జా దారులు తమ భూమికి ఉన్న సరిహద్దు రాళ్లు తీసివేసి, భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని.. దయ చేసి తమ భూమిని సర్వే చేసి రాళ్లు పాతించాలని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలానికి చెందిన ఎమ్. సత్యం నేతలకు అర్జీ అభ్యర్థించాడు.
- బాపట్ల జిల్లా, అద్దంకికి చెందిన నారిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి



చేస్తూ.. తాను కొనుగోలు చేసిన భూమిని దొంగ రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా.. తనపైకి దౌర్జన్యం చేస్తూ.. తనను చంపుతామని బెదిరిస్తున్నారని.. ఆక్రమణ దారులకు అధికారులు వత్తాసు పలుకుతూ తప్పుడు రిపోర్ట్ లు ఇస్తున్నారని.. తమ వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించి తమ భూమిని కబ్జా నుండి విడిపించాలని గ్రీవెన్స్ లో నేతలకు వేడుకున్నాడు.
- నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం కొత్తపల్లె, గోకవరం మజరా, యం. లింగాపురం గ్రామాలకు చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తూ.. రైతులకు సాగునీటికోసం చెరువును నిర్మించి నీటి పారుదల కోసం కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నీరంతా తూము ద్వారా వాగుకు వృథాగా పోతుందని.. దయ చేసి కాలువలు ఏర్పాటు చేసి సాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.
- కడప జిల్లా, కడపకు చెందిన ఎస్. బాషా విజ్ఞప్తి చేస్తూ.. కడప టౌన్‌లో ప్రైవేట్ స్థలాల్లో ఎగ్జిబిషన్ లు పెట్టకూడదని గత ప్రభుత్వంలో తీర్మానం చేడంతో దాదాపు 300 కుటుంబాలకు పైగా ఉపాధి కోల్పోయారని.. ఎగ్జిబిషన్‌లు పెట్టుకోవడానికి పర్మిషన్ లు ఇప్పించి ఆదుకోవాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.

## తెలుగు యూనివర్సిటీకి ‘సురవరం’ పేరు హర్షణీయం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్, మహానాడు:**
తెలుగు యూనివర్సిటీకి గొప్ప సాహితీవేత్త, వనపర్తి నియోజకవర్గం తొలి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టడం హర్షణీయం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు.

సురవరం ప్రతాప్ రెడ్డి రచించిన “ఆంధ్రుల సాంఘిక చరిత్ర “ అనే గొప్ప గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రదానం చేసిందని చిన్నారెడ్డి గుర్తు చేశారు. గోల్కొండ పత్రిక ద్వారా ప్రజలను జాగృత పర్చిన గొప్ప సంపాదకులు సురవరం ప్రతాప్ రెడ్డి అని చిన్నారెడ్డి కొనియాడారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలన్న వనపర్తి నియోజకవర్గం ప్రజల చిరకాల కోరిక అసెంబ్లీ తీర్మాణంతో నెరవేరిందని చిన్నారెడ్డి అన్నారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర కేబినెట్ కు, అసెంబ్లీ సభ్యులకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



## కేసీఆర్‌ను సీఎం తాగుబోతు అనడం హేయం

- మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

**హైదరాబాద్, మహానాడు:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను తాగుబోతు అనడం బాధించిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకురాలు కాట్రగడ్డ ప్రసూన అన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తలు చూసి చాలా బాధపడ్డానని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన గొప్ప వ్యక్తి కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం సాధించడంలో అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు పోయి తెలంగాణ రాష్ట్రం ను సాధించిన వ్యక్తి కేసీఆర్ అని ఆమె కొనియాడారు. నేను 18 ఏళ్ళు ఆయనతో కలిసి పనిచేశాను. తెలంగాణ స్వాతంత్ర్య ఉద్యమంలో కేసీఆర్ పాత్ర మరువలేనిది.



వ్యక్తిగత విషయాలను రాజకీయాలకు ముడిపెట్టడం సరైంది కాదు. ఒక్క కేంద్ర మంత్రిగా, రాష్ట్ర మంత్రిగా అందరి మన్ననలు పొందిన వ్యక్తి మేధావి, ఎన్నో ఉపన్యాసాలు విన్నాను.

నా పార్టీ ఏదైనా కానీ పార్టీలతో పనిలేకుండా నేను కేసీఆర్ పై ముఖ్యమంత్రి వాడిన పదజాలంని సిగ్గుతో తలవంచుకుంటున్నాను. రాజకీయాలు అంటే ఇంత హీనంగా ఉండాలా. ఇంత దిగజారి మాట్లాడం దేనికి సంకేతం.. పథకాలతో అభివృద్ధిలో పోటీపడాలి.

కొత్త పథకాలు ఇచ్చి రాజకీయాలు చేయాలి కానీ ఇలాంటి సిగ్గుమాలిన మాటలతో రాజకీయాలు చేయొద్దని ఆమె హితవుపలికారు.

## ఏపీ ఆయుర్వేద, హోమియోపతి వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ (సవరణ) బిల్లుకు శాసనసభ ఆమోదం

**అమరావతి, మహానాడు:**
ఆంధ్రప్రదేశ్ (ఆయుర్వేద, హోమియో, యునాని) వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్ కు సంబంధించిన సవరణ బిల్లును ఆంధ్రప్రదేశ్ శాసనసభ సోమవారం నాడు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ప్రతిపాదించిన



సవరణల ప్రకారం ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్ కోసం ప్రస్తుతం అమలులో ఉన్న ఆయుర్వేద వైద్య రిజిస్ట్రేషన్ బోర్డ్, హోమియో, యునాని వైద్య విధానాల రిజిస్ట్రేషన్ బోర్డ్ ల స్థానంలో ఆయా వైద్య విధానాల మండళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఈ బిల్లులో సవరణలు ప్రతిపాదించిందని మంత్రి వివరించారు.

ఆంధ్రా ప్రాంతంలో ఆయుర్వేద, హోమియో వైద్య విధానాలలో వైద్య వృత్తి కొనసాగిస్తున్న వారి విద్యార్హతలను క్రమబద్ధీకరించడం ఈ బిల్లు ముఖ్యోద్దేశమన్నారు. గతంలో 1956లో ఆమోదించిన చట్టం ద్వారా ఆయుర్వేద, హోమియో వైద్య విధాన బోర్డులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుతం అమలులో వున్న విధి విధానాలను సవరిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, దానితో పాటు బోర్డ్ లు, కౌన్సిళ్ళ ఏర్పాటుకు మార్గదర్శకాలు కూడా జారీ చేసిందని మంత్రి చెప్పారు.

యుర్వేద, హోమియో వైద్య వృత్తిదారులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద వైద్య మండలి, ఆంధ్రప్రదేశ్ హోమియో వైద్య మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సవరణలు ప్రతిపాదిస్తోందన్నారు. ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదించటంతో బిల్లు సభ ఆమోదముద్ర పొందినట్టు అధ్యక్ష స్థానంలో ఉన్నఉపసభాపతి రఘురామకృష్ణం రాజు ప్రకటించారు.

06
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 18, మార్చి 2025

# విశ్వవిద్యాలయం పేరు మార్పు కాంగ్రెస్ వైఖరికి నిదర్శనం!

**- బీజేపీ నేత విష్ణు వర్ధన్ రెడ్డి**



**విజయవాడ, మహానాడు:** పొట్టి శ్రీరాములు తెలుగు భాష, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు. అటువంటి గొప్ప త్యాగమూర్తి పేరు మీద ఉన్న "పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం" పేరును మార్చడం తెలుగు భాషను, కోట్ల మంది తెలుగువారి గౌరవాన్ని అవమానించే చర్య అని బీజేపీ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. విష్ణు వర్ధన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌కు గాంధీ కుటుంబం తప్ప ఏ స్వాతంత్ర్యం సమరయోధులను గౌరవించడం తెలియదు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నుంచి, తెలుగువారి గౌరవంగా నిలిచిన పీవీ నరసింహారావు వరకు ఆ పార్టీ సొంత పార్టీల వారిని గౌరవించలేదని ఆయన మండిపడ్డారు.

## జైల్లో ఖైదీలకు ఫోన్లు అందించిన దంపతులు అరెస్ట్




**విశాఖపట్నం, మహానాడు:** శ్రీకాకుళం జిల్లా, జలుమూరు పీఎస్ లో విధులు నిర్వహిస్తున్న భార్యాభర్తలను అరిలోవ పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో ఈ కారాగారంలో పనిచేసిన ఫార్మాసిస్టు శ్రీనివాసరావుతో పాటు అతడి భార్య పుష్పలతను ఆదివారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై కృష్ణ తెలిపారు. జైలులో ఉన్న నాగమల్లేశ్వరావు అనే ముద్దాయికి ఫోన్లు అందించినట్టు దర్యాప్తులో తేలిందన్నారు.

## డిక్లరేషన్ ఫామ్ అందుకున్న టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు

**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల రెండోసారి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ బీటీ నాయుడు కి డిక్లరేషన్ ఫామ్ ను ఎన్నికల అధికారి వనితా రాణి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మరోమారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి, మంత్రి నారా లోకేష్ కి, రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, విప్ లు కంచర్ల శ్రీకాంత్ చౌదరి,



వెంపాడ చిరంజీవి, టీడీపీ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్ బాబు పాల్గొన్నారు.

## ఏపీలో ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

- తొలి రోజు పరీక్షకు 98.27 శాతం మంది హాజరు

**అమరావతి, మహానాడు:** ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయని పాఠశాల విద్య సంచాలకుడు విజయ్ రామరాజు.వి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6,27,277 మంది విద్యార్థులకు గానూ 6,16,451 మంది విద్యార్థులు హాజరు కాగా, 10,826 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. 3,450 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 1545 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో ఇద్దరు విద్యార్థులు కాపియింగ్ కు పాల్పడ్డారని, ఆ ఇద్దరిని డిబార్ చేసినట్టు ఆయన తెలిపారు.



నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియా రాష్ట్రంలోని బేఏరియా ఎన్నారై టీడీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం శనివారం సాయంత్రం మిల్పిటాస్‌లో వేడుకగా జరిగింది. ఎన్నారై టీడీపీ నాయకుడు కోగంటి వెంకట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 100 మంది పైగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరయ్యారు.



## చేనేత కళాకారులకు ఉచిత విద్యుత్

- క్యాబినెట్ ఆమోదం
- పాదయాత్ర హామీని నిలబెట్టుకున్న లోకేష్

**అమరావతి, మహానాడు:** చేనేత కళాకారులకు 200 యూనిట్లు.. పవర్ లూమ్ ఉన్నవారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో పాదయాత్రలో ఇచ్చిన మరో హామీని నారా లోకేష్ నిలబెట్టుకున్నారని పలువురు అభినందిస్తున్నారు. చేనేత కళాకారులకు ఉచిత విద్యుత్ ఇస్తానని నాడు లోకేష్ హామీ ఇచ్చారు.



ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విశేష పూజల్లో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ దంపతుల పాల్గొన్నారు.

# మహిళలను మోసం చేశామని అంగీకరించడం సిగ్గుచేటు

- కాంగ్రెస్ మెనిఫెస్టో చిత్తుకాగితమని తేలిపోయింది
- మహిళా వ్యతిరేక సీఎంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు
- శాసన మండలి సాక్షిగా బయటపడ్డ కాంగ్రెస్ బండారం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కన్నెర్ర
- మిర్చికి 25 వేల మద్దతు ధర ప్రకటించాలి
- ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్:** మహిళలకు మోసం చేశామని స్వయంగా ప్రభుత్వం అంగీకరించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మహిళా వ్యతిరేక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని స్పష్టం చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో దురుసుగా మాట్లాడడమే కాకుండా ఈ రోజు స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర: మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయబోమని చెప్పకనే చెప్పారని ఆక్షేపించారు.

కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కళ్యాణమస్తు పథకం పేరిట పెండ్లి సందర్భంగా ఆడపిల్లలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారని, ఇప్పటి వరకు జరిగిన వివాహాలకు కూడా ఇస్తారా లేదా అని సోమవారం నాడు శాసన మండలిలో ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ... ఆ పథకాన్ని అమలు చేసే ఆలోచన లేదని తెలిపారు. దాంతో ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




శాసన మండలి మీడియా పాయింట్ వద్ద విలేకరులతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ మెనిఫెస్టో చిత్తుకాగితమని తేలిపోయిందని, ప్రజలను, ముఖ్యంగా మహిళలను మోసం చేయడానికే ఇబ్బడి ముబ్బడిగా కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీత తో సమానం అని పదే పదే అంటున్నారని, కానీ అవన్నీ అబద్దాలేనని శాసన మండలి సాక్షిగా బయటపడిందని తెలిపారు. కళ్యాణమస్తు పథకమే కాకుండా మహిళలకు నెలకు 2500 ఇస్తామన్న హామీ, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామన్న హామీలు అమలుపై అనుమానాలు నెలకొన్నాయని, ప్రభుత్వ వైఖరి గమనిస్తే మహిళలను చిన్నచూపు చూస్తున్నట్లు కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు తప్పకుండా బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని, మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఏ మాతరం చిత్తశుద్ధి లేదనడానికి ఈ ఉదంతమే నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో కేసీఆర్ గారు ఆడబిడ్డలకు అండగా నిలబడ్డారని, తల్లిదండ్రులకు అండగా పాప పుట్టినప్పటి నుండి పెళ్లి అయ్యే వరకు కేసీఆర్ వారికి వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేశారు.

మరోవైపు, మిర్చి పంటకు రూ. 25 వేలు కనీస మద్దతు ధర ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మిర్చి ధరలు పడిపోయి రైతులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడానికి నిరసనగా సహచర బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్సీ కవిత శాసన మండలి ఆవరణలో ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎండు మిర్చి దండలను మెడకు వేసుకొని ఎమ్మెల్సీలు విన్నూత రీతిలో నిరసన తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... మిర్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం సరికాదని సూచించారు. నాఫెడ్, మార్క్ ఫెడ్ వంటి సంస్థ ద్వారా ప్రభుత్వమే మిర్చి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సుగంధ ద్రవ్యాల బోర్డు పరిధిలోకి మిర్చి పంటను కూడా తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అలాగే, పసుపు పంటకు కూడా రూ. 15 వేల మేర కనీస మద్దతు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు.

# రేవంత్ సెల్ఫ్‌డ్రైవింగ్‌తో రహస్య యాత్ర

- రేవంత్ దాటిన రేఖలు, తారలు, వాణిల గురించి మాట్లాడగలం
- మేము నోరు విప్పితే రేవంత్‌కు ఇంట్లో అన్నం పెట్టరు
- సాగర్ సొసైటీ, మైహెూం భుజా వ్యవహారాల గురించి మాట్లాడగలం
- ఎక్కువ మాట్లాడితే ఫోటోలు కూడా బయట పెడతాము
- రేవంత్ సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రయివేట్ కార్లపైన వివరాలు చెప్తాం
- రేవంత్‌కు ఈ రోజు కుటుంబం గుర్తుకు వచ్చిందా?
- రేవంత్ ముఠా టిడిఆర్ స్కాం చేయబోతున్నది
- నేరాన్ని అంగీకరించి రేవంత్ అప్రూవర్‌గా మారారు
- రేవంత్ రెడ్డికి గాసిప్స్ మీద తప్ప గవర్నెన్స్ మీద దృష్టి లేదు
- అందాల పోటీలతో ఊరూరికీ బ్యూటీ పార్లర్ పెడతావా?
- అసెంబ్లీలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మీడియా చిట్ చాట్

**హైదరాబాద్:** 70 వేల కోట్ల ఆదాయం తగ్గిందని సీఎం ఒప్పుకున్నారు తెలంగాణ రైజింగ్ అంటూనే ఈ తగ్గింపు ఏమిటి? ఇది ముమ్మాటికి తెలంగాణ ఫాలింగ్. ఇంతకంటే రాష్ట్రానికి ఘోరమైన అవమానం ఇంకోటి ఉండదు.

బడ్జెట్‌లో 71 వేల కోట్ల రూపాయల తగ్గింపు దారుణం. తెలంగాణలో వ్యవసాయం, పెట్టుబడులు, పరిశ్రమలు పెరుగుతున్నాయని ప్రభుత్వం గొప్పగా చెప్తుంటే మరి అదాయం ఏట్లా తగ్గింది? బంగారం లాంటి రాష్ట్రాన్ని అప్పజెప్పితే, కాన్సర్ అంటూ మాట్లాడి రేవంత్ సర్వనాశనం చేశాడు.

ఏఏ రంగాల్లో వృద్ధి పెరిగిందో బడ్జెట్‌లో చెప్పాలి. దానితో వచ్చే అదాయం పెరిగిన తీరు చెప్పాలి.

బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్ గా రేవంత్ మారారు. ప్రభుత్వం పూర్తి అట్టర్ ఫ్లాఫ్ అని సీఎం స్వయంగా ఒప్పుకున్నారు. ఎవరైనా ముఖ్యమంత్రి ఇండ్లు కడతారు... కానీ, కూలగొడతారా? ఆదాయం పెంచే తెలివి ఈ ప్రభుత్వానికి అస్సలు లేదు గాల్లో మెడలు కట్టడం లేదని, వాస్తవిక బడ్జెట్ పెడ్తున్నామని భట్టి విక్రమార్క గొప్పగా చెప్పారు. ఇన్నాళ్లు మేము చెప్పిందే నిజమైందని ఒప్పుకున్నారు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి సీఎం విధానాలే కారణం కేసీఆర్‌పై ద్వేషంతో కాళేశ్వరం బంద్ పెట్టి వ్యవసాయం నాశనం చేశారు

రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైనది అని చెప్పినప్పుడు వినలేదు. బడ్జెట్ కోతతోనే అదే నిజమైంది.

రేవంత్ ఏడాది కాలంగా చేసిందంతా నెగటివ్ పాలిటిక్స్, అక్రమ నిర్భందాలు, తెలంగాణను కాన్సర్ అంటూ రాష్ట్ర పరువు తగ్గించడం వంటి అడ్డమైన మాటల వల్లనే తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది.

### రేవంత్ పాలనపై..

రేవంత్ వంటి పిచ్చోడి చేతిలో తెలంగాణ రాయి అయిపోయింది. ముఖ్యమంత్రి అయిన మొదటి ఏడాదిలోనే రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిండు అనదానికి ఇదే నిదర్శనం. మొదటి సంవత్సరం పరీక్షలో ముఖ్యమంత్రి దారుణంగా విఫలమయ్యాడు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైంది. ఎలాంటి ఆర్థిక మాంద్యం లేకుండానే, కోవిడ్ వంటి సంక్షోభం లేకుండానే ఆర్థిక పరిస్థితి దిగజారింది.

కేంద్రంతో మంచిగా ఉన్నానని చెప్తున్న రేవంత్ రెడ్డి రాష్ట్రానికి అదనంగా తెచ్చింది ఏమిటి? రేవంత్ రెడ్డి ఢీల్లీ పర్యటనల వలన కేంద్రం నుంచి తీసుకొచ్చి నిధులు, చేసిన లాభం ఏమిటి? ముఖ్యమంత్రి ఫెయిల్ అయినట్లు నేరుగా చెప్పాడు.

బడ్జెట్‌లో కోత అంటే ఇన్ని రోజులు మేము చేసిన విమర్శలు అన్నీ నిజమే. కేసీఆర్ మీద ఉన్న కోపంతో, పంటలు ఎండబెట్టడంతో ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం నుంచి కాంట్రిబ్యూషన్ తగ్గింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో ఆర్థిక వ్యవస్థ మరింతగా దిగజారింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పట్టణాలు, గ్రామాల్లో దిగజారడానికి కారణం పూర్తిగా రేవంత్ రెడ్డి మాత్రమే

### రేవంత్ ఢీల్లీ పర్యటనపై..

ఢిల్లీకి 40 సార్లు కాకపోతే 400 సార్లు పోయి ప్రధానమంత్రి మోడీ, రాహుల్ గాంధీ కాళ్లు పట్టుకో, మాకేం సమస్య లేదు, కానీ తెలంగాణకి ఎన్ని నిధులు తెచ్చినావో చెప్పు? కేంద్రంతో సఖ్యతతో ఉండి సాధిస్తామని అన్నారు... ఏం సాధించారు? తెలంగాణ ప్రజలు విచక్షణతో ఆలోచించి రెండుసార్లు మాకు అవకాశం ఇచ్చినారు, కాబట్టి తెలంగాణ బలంగా నిలబడింది.

రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రి తో సమైక్యాంధ్ర పాలకులు అన్న మాటలు నిజమవుతున్నాయి.

తెలంగాణకి నాయకత్వ లక్షణాలు లేవు, చేతకాదు, పరిపాలన చేయడం రాదన్న ఆరోపణల్ని తన పాలనతో రేవంత్ రెడ్డి నిజమే అని నిరూపిస్తున్నట్టు కనిపిస్తుంది. రేవంత్ రెడ్డి 2014లో గనుక ఉండుంటే తెలంగాణ విఫలరాష్ట్రంగా మిగిలిపోయేది. మా నాయకుడు రాష్ట్ర ప్రభుత్వం యొక్క బట్టలు విప్పి అసెంబ్లీలో నిలబెట్టాడు. ఓవర్సీస్ స్కాలర్ షిప్పులకు సంబంధించిన ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని అసెంబ్లీలో ఎండగట్టాడు. ఏడువేల మందికి పైగా విద్యార్థులు, తెలంగాణ బిడ్డలు విదేశాలకు చదవుకోవడానికి వెళ్లి బాగా ఇబ్బంది పడుతున్నారు. రేవంత్ రెడ్డికి గాసిప్స్ మీద తప్ప గవర్నెన్స్ మీద దృష్టి లేదు.

రేవంత్ ముఠా టిడిఆర్ స్కాం చేయబోతున్నది. రేవంత్ టిడిఆర్ పైన మాట్లాడాలి. భూములు అమ్మకూడదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ధర్నాలు చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఇప్పుడెందుకు వస్తలేడు..గతంలో అక్కడికి వచ్చి ఫోజులు కొట్టి పోయిండు కదా? రాహుల్ ఎందుకు స్పందించడం లేదు. రాహుల్ స్పందించాలి

### రేవంత్ నీతిసూత్రాలపై కేటీఆర్ ఎద్దేవా

నామీద 15 కేసులు పెట్టిన రేవంత్ రెడ్డికు ప్రజాసామ్య విలువలు ఈ రోజు గుర్తుకు వచ్చాయా? రేవంత్ కు ఈ రోజు కుటుంబం గుర్తుకు వచ్చిందా?

మాపై దారుణమైన, అసహ్యకరమైన అరోపణలు, మాటలు మాట్లాడినప్పుడు మాకు కుటుంబాలు, ఫ్యామిలీలు లేవా?

మాకు సంబంధాలు అంటగట్టినప్పుడు, మా పిల్లల్ని రాజకీయాల్లోకి లాగిన రోజు మీకు విలువలు లేవా? ఈ రోజు ముఖ్యమంత్రి తన పిల్లలు, భార్య గురించి మాట్లాడుతున్నారు, మరి ఆ రోజు మాకు కూడా కుటుంబాలు ఉండేవి కదా?

ఇదేనా జర్నలిస్టులకు రేవంత్ రెడ్డి ఇచ్చే గౌరవం?

నీతో కలిసి వచ్చినప్పుడు నీ మాటలు చెప్పినప్పుడు యూట్యూబర్లంతా జర్నలిస్టులుగా కనిపించారు. ఇవాళ నిన్ను విమర్శిస్తే జర్నలిస్టులు కారా? ఒకప్పుడు జర్నలిస్టుగా పనిచేసిన వాళ్లు ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను యూట్యూబ్‌లో ఎండగడుతుంటే వాళ్లని జర్నలిస్టులు కాదంటున్నాడు.

జర్నలిస్టులను జర్నలిస్టులు కాదంటూ రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు.

జర్నలిస్టుల బట్టలు విప్పిస్తా అని రేవంత్ రెడ్డి అన్నప్పుడు ఎవరూ



మాట్లాడటం లేదు. ఇదేనా జర్నలిస్టులకు రేవంత్ రెడ్డి ఇచ్చే గౌరవం?

విలువలని అసెంబ్లీలో చిలకపలుకులు మాట్లాడి, స్టేషన్ ఘన్‌పూర్‌లో బజారు భాష మాట్లాడాడు. రాజకీయాల్లో హద్దు దాటకూడదని ఇన్నాళ్ళు సంయమనంతో వ్యవహరించాము

మేం కూడా రేవంత్ లెక్కనే మాట్లాడితే బయటతిరగలేడు. మేము కూడా రేవంత్ బట్టలు విప్పగలం. రేవంత్ దాటిన రేఖలు, తారలు, వాణిల గురించి మాట్లాడగలం. మేము నోరు విప్పితే రేవంత్‌కు ఇంట్లో అన్నం పెట్టరు. మేము కూడా సాగర్ సొసైటీ, మైహెూం భుజా వ్యవహారాల గురించి మాట్లాడగలం. ఎక్కువ మాట్లాడితే ఫోటోలు కూడా బయట పెడతాము రేవంత్ సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రయివేట్ కార్లపైన వివరాలు చెప్తాం

### రేవంత్ అప్పుల లెక్కలు తప్పు

కాగ్, ఆర్బిఐ లెక్కలు కాకుండా రేవంత్ కాకి లెక్కలు చెప్తుండు. రేవంత్ చెప్తున్న లెక్కల్లో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కెసి వెణుగోపాల్ తో పాటు కాంగ్రెస్ అధిష్టానానికి ఆయన పంపిన మూటల లెక్కలు కూడా ఉన్నట్టున్నాయి. బిజెపి సినియర్ నేతలతో సిఎం రహస్య మీటింగ్ పెట్టుకుంటుడు. కనీసం సిఎం నుంచి ఖండన కూడా లేదు.

### అందాల పోటీలపై..

అందాల పోటీలు పెట్టి రేవంత్ ఏం సాధించాలనుకుంటున్నారు? రాష్ట్రం అప్పులపాలైందని చెప్పి, అందాల పోటీలు పెడతారా? మింగ మెతుకు లేదు. మీసాలకు సంపెంగ నూనె అన్నట్టుంది అందాల పోటీ కథ. 46 కోట్లతో ఫార్ములా ఈ రేసు పెట్టి రాష్ట్రానికి ఏం తెస్తామో చెప్పినా వినకుండా అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ ఇవాళ 250 కోట్లతో అందాల పోటీలు ఎందుకు నిర్వహిస్తున్నారు?

ఆత్మహత్యలతో తల్లడిల్లుతున్న రాష్ట్రంలో అందాల పోటీలు సిగ్గుచేటు. రేవంత్ జవాబు చెప్పాలి, కాంగ్రెస్ సమాధానం చెప్పాలి. అందాల పోటీలతో ఊరూరికీ బ్యూటీ పార్లర్ పెడతావా? ఇప్పుడు అందాల పోటీలకు అంత ప్రాధాన్యత లేదు. కరెంట్ కోతలు, తీవ్ర వ్యవసాయ సంక్షోభంలో రాష్ట్రం చిక్కుకుంటే, ప్రభుత్వం ఫోకస్ మొత్తం అందాల పోటీల మీద ఉంది.

ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కావడం లేదు. అడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని మోసం చేశారు? ఫార్ములా ఈ వల్ల వచ్చిన లాభం నేను చెప్పిన. ఫార్ములా ఈ తో ఏకపక్షంగా ఒప్పందం రద్దు చేసుకుని 46 కోట్లు పోవడానికి రేవంత్ కారణం అయ్యాడు. ఒప్పందం రద్దు చేసుకుంటే డబ్బులు పోతాయని తెలిసినా, రేవంత్ కావాలనే రద్దు చేశాడు. ప్రజల డబ్బులు పోయేలా చేశాడు. ఈ ఒప్పందం రద్దు చేయడంతో జరిగిన ప్రజల సొమ్ము నష్టంపై ప్రభుత్వంలోకి రాగానే విచారణ జరుపుతాం.

### మన జాతిపిత గాంధీని చంపింది గాడ్సె

తెలంగాణ జాతిపిత లాంటి కేసీఆర్ పై చిల్లర మల్లర మాటలు. మాట్లాడుతున్నది అభినవ గాడ్సె రేవంత్ రెడ్డి. రేవంత్ వి గాడ్సె మూలాలే.

# వైయస్ఆర్‌సీపీపై బురదచల్లే యత్నం

- రాష్ట్ర విభజన నుంచి జరిగిన అన్ని స్కామ్‌లపై చర్చిద్దామని కోరాం
- టీడీపీ హయాంలో జరిగిన స్కామ్‌లపై చర్చకు ప్రభుత్వం నిరాకరించింది
- కేవలం గత ప్రభుత్వ స్కాంలపైనే చర్చ జరగాలని టీడీపీ పట్టుబట్టింది
- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

**అమరావతి:** వైయస్ఆర్‌సీపీ పాలనపై బురదచల్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అసెంబ్లీ బయట మీడియా పాయింట్‌లో వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన స్కాంలపై చర్చించాలంటూ అధికారపక్షం పట్టుబట్టడం వెనుక కుట్ర దాగి ఉందని అన్నారు. అసలు విచారణే జరగకుండా కేవలం ఆరోపణలను స్కామ్‌లుగా చిత్రీకరించి వైయస్ఆర్‌సీపీ పాలనపై విషం చిమ్మేందుకు ప్రయత్నించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. .

లేనిది ఉన్నట్లుగా... ఉన్నది లేనట్లుగా చిత్రీకరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అలాగే ఈ రోజు స్కామ్‌లపై చర్చ అంటూ మండలిలో అధికారపక్షం హంగామా చేసింది. రాష్ట్ర విభజన తరువాత నుంచి ఇప్పటి వరకు అంటే 2014-24 వరకు జరిగిన స్కామ్‌లపై చర్చించాలని వైయస్ఆర్‌సీపీగా ప్రభుత్వాన్ని కోరాం. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం వైయస్ఆర్‌సీపీ పాలన అంటే 2019-24 వరకు మాత్రమే చర్చకు సిద్దమని ప్రకటించింది.

అసలు గత అయిదేళ్ళ పాలనలో జరిగిన వాటిపైన కూటమి ప్రభుత్వం ఈ పదినెలల్లో పలు ఆరోపణలు మాత్రమే చేసింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు కూడా పూర్తి కాలేదు, నిరూపణ జరగలేదు. అటువంటప్పుడు వైయస్ఆర్‌సీపీ పాలనలో స్కామ్‌లు అంటూ మీరు చేసిన తప్పుడు ఆరోపణలపైన సభలో ఎలా చర్చిస్తారని



అధికారపక్షాన్ని నిలదీశాం. 2014-19 మధ్య తెలుగుదేశం పాలనలో పలు కుంభకోణాలు జరిగాయి. వాటిపై కేసులు కూడా నమోదయ్యాయి. దర్యాప్తు కూడా పూర్తయ్యింది. వాటిపై మాత్రం చర్చకు వచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించడం లేదు.

ఇది కూటమి ప్రభుత్వ ద్వందవైఖరి కాదా? స్కామ్‌లపై చర్చకు వైయస్ఆర్‌సీపీ సిద్దంగా ఉంది. ప్రజలకు వాస్తవాలను వెల్లడించేందుకు సుముఖంగా ఉంది. కానీ దురుద్దేశపూర్వకంగా చర్చను గత ప్రభుత్వ కాలానికే పరిమితం చేయాలని చూడటం దుర్మార్గం. దీనికి నిరసనగా మండలి నుంచి వాకౌట్ చేశాం.

07
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 18, మార్చి 2025 ‖

# పొట్టి శ్రీరాములు పేరు అందుకే తొలగించాం

- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందాం
- చిత్తశుద్ధి ఉంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలి
- బీసీ రిజర్వేషన్ల సాధనకు నేను నాయకత్వం వహిస్తా
- కామారెడ్డి ప్రకటనకు మేం కట్టుబడి ఉన్నాం
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:** రాజకీయాలు కలుషితమయ్యాయో నాయకుల ఆలోచనలు కలుషితమయ్యాయో తెలియడం లేదు. పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటంలేదు. వారి ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలి. పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నాం.

రాష్ట్ర పునర్విభజన తరువాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని వర్గాలకు కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నాం. ఇది ఎన్టీఆర్ ను అగౌరవపరిచినట్టు కాదు.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నాం. వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరును పెట్టుకున్నాం. ఇందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టుకున్నాం.

ఏపీలో ఆ పాత పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చుకున్నాం. ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే పరిపాలనలో గందరగోళం ఉంటుంది. అందుకే తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నాం. అంతే కానీ వ్యక్తులను అగౌరవపరిచేందుకు కాదు. విశాల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు కులాన్ని ఆపాదిస్తున్నారు.

కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటే అది తప్పు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియం పేరు తొలగించి ప్రధాని మోదీ పేరు పెట్టారు. మేం అలాంటి తప్పిదాలు చేయలేదు.చేయం. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందాం. చిత్తశుద్ధి ఉంటే కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలి.

బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్‌కు రోశయ్య పేరు పెట్టుకుందాం. రోశయ్యసేవలను కీర్తించుకునేలా అక్కడ వారి విగ్రహాన్ని ఆవిష్కరించుకుందాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని రాహుల్ గాంధీ ఆనాడు హామీ ఇచ్చారు. మేం బాధ్యతలు చేపట్టగానే 4 ఫిబ్రవరి 2024 లో బీసీ కులగణన ప్రక్రియను మొదలు పెట్టాం. కులసర్వేలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

తెలంగాణ సమాజం బలహీన వర్గాలకు రిజర్వేషన్ల విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారని సందేశం ఈ సభ ద్వారా పంపించాలనుకున్నాం. ఇందుకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు.

బీసీ రిజర్వేషన్లు 37 శాతానికి పెంచాలని గత ప్రభుత్వం గవర్నర్ కు ప్రతిపాదన పంపించింది. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచేందుకు గత ప్రభుత్వం గవర్నర్ కు పంపిన ప్రతిపాదనను ఉపసంహరించుకుని కొత్త ప్రతిపాదన పంపిస్తున్నాం. 4 ఫిబ్రవరిని సోషల్ జస్టిస్ డే గా సభ ద్వారా తీర్మానం చేశాం. అందరినీ సంప్రదించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఈ బిల్లును తీసుకొచ్చాం. సభా నాయకుడిగా నేను మాట ఇస్తున్నా. బీసీ రిజర్వేషన్ల సాధనకు నేను నాయకత్వం వహిస్తా.

అఖిలపక్ష నాయకులు అందరం కలిసికట్టుగా వెళ్లి ప్రధానిని కలుద్దాం. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచేందుకు అవసరమైన చట్ట పరమైన చర్యలు తీసుకుందాం. ఇందుకోసం ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ సభాపక్షనాయకుడిని కోరుతున్నా. రాహుల్ గాంధీని కూడా కలిసి పార్లమెంట్ లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరదాం రాహుల్ గాంధీ సమయం తీసుకోవాల్సిందిగా మా పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కి బాధ్యత అప్పగిస్తున్నా. సభా నాయకుడిగా నేను మాట ఇస్తున్నా.. కులసర్వేలో పొందుపరిచిన బీసీల లెక్క వందశాతం సరైంది

బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదు. కామారెడ్డి ప్రకటనకు మేం కట్టుబడి ఉన్నాం.

# రాజీవ్ యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 4 నుంచి 5 వేల మందికి ఉపాధి

- రాజీవ్ యువ వికాసం" ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** రూ.6000 కోట్లతో 5 లక్షల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శాసనసభ ప్రాంగణంలో ఒక మంచి కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషం. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని ఇదే ప్రాంగణంలో ప్రారంభించుకున్నాం.




ఈ 15 నెలల్లో 57 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసుకున్నాం. 50 లక్షల కుటుంబాల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వెలుగులు చూస్తున్నాం. 43 లక్షల కుటుంబాలు రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 1 కోటి 30 లక్షల నాణ్యమైన చీరలు అందించే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రంలోని 29,500 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం

అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల నిర్వహణ ఆడబిడ్డలకు అప్పగించాం. కులగణన సమాజానికి ఎక్స్ రే లాంటిదని రాహుల్ గాంధీ చెప్పారు. కులగణన నిర్వహించి ఇవాళ బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకుంటున్నాం.కులగణనలో బీసీల లెక్క 56.36 శాతంగా తేలింది.. వారికి 42 శాతం రిజర్వేషన్లు అందించాలి.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు బిల్లును కూడా సభ ముందుకు తీసుకొచ్చాం. దీనిని ఆమోదించుకుని ఎస్సీలకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నాం. పరిపాలనను ప్రక్షాళన చేస్తూ.. పారదర్శక విధానంతో ముందుకు వెళ్తున్నాం. ప్రభుత్వ ఆదాయం తగ్గినా.. అప్పులు పెరిగినా ధైర్యాన్ని కోల్పోలేదు

అబద్ధాల ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడపదలచుకోలేదు. అందుకే దుబారా తగ్గించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నాం. ఇసుక, ఇతర విధానాలను స్ట్రీమ్ లైన్ చేస్తూ ప్రభుత్వ ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో ఇసుకపై ప్రభుత్వానికి కోటిన్నర ఆదాయం వస్తే%% ఇవాళ ఇసుక ఆదాయం మూడున్నర కోట్లకు పెరిగింది. పన్నుల వసూలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. నిరుద్యోగసమస్యను 8.8 నుంచి 6.6, నిత్యావసర వస్తువుల ఇన్ఫేషన్ లో 1.3 తో దేశంలోనే తెలంగాణ ముందు ఉంది.

ఇది మేం చెప్పేది కాదు.. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన గణాంకాలు. రాజీవ్ యువ వికాసం ద్వారా రో. 50వేల నుంచి రూ. 4లక్షల వరకు మంజూరు చేసేందుకు దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించుకున్నాం జూన్ 2 న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తాం. రాజీవ్



యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 4 నుంచి 5 వేల మందికి ఉపాధి కలిగించొచ్చు. నిజమైన నిరుద్యోగులకు ఇది అందాలి.. వారికిది ఉపయోగపడాలి.

ఉద్యోగాల భర్తీ, టీచర్ల బదిలీలు ఎలాంటి ఆరోపణ లేకుండా పారదర్శకంగా నిర్వహించాం. పథకాల అమలులో పారదర్శకంగా ఉండాలి.. అప్పుడే ప్రజలకు మెరుగైన పాలన అందించగలుగుతాం. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. ఇది పార్టీ పథకం కాదు.. ప్రజల పథకం. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు

# భయం వేస్తోంది.. భద్రత పెంచండి

- నా భద్రతపై అనుమానాలు
- నేను సీఎం ఉండే ఏరియాలోనే ఉంటాను... అయినా దుండగులు చొరబడుతున్నారు
- హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆగంతకుడు చొరబడిన ఘటనపై మహబూబ్ నగర్ లో ఎంపీ డీకే అరుణ అనుమానాలు
- గతరాత్రి హైదరాబాద్ లోని నా ఇంట్లో జరిగిన ఆగంతకుడి చొరబాటు ఘటన భయాందోళన
- నా భద్రతపై అనుమానాలు
- నేను సీఎం ఉండే ఏరియాలోనే ఉంటాను... అయినా దుండగులు చొరబడుతున్నారు
- గతరాత్రి ఓ దుండగులు నా ఇంట్లోకి వెనక కిచన్ లోకి ప్రవేశించి గంటన్నరపాటు కలియదిరిగి వెళ్లిపోయాడు
- ఇది ముమ్మాటికీ అనుమానాలకు తావిస్తోంది
- అసలీ దుండగులు నా ఇంట్లోకి ఎందుకు చొరబడ్డాడో అన్నవిషయం ఆలోచిస్తేనే భయం వేస్తోంది

**హైదరాబాద్:** 2రోజులుగా నేను మహబూబ్ నగర్ లోనే ఉన్నాము. గత అర్ధ రాత్రి 3 గంటలకు కిచెన్ కిటికీ తీసి ఇంట్లోకి వచ్చారు. ఇల్లంతా ఒక గంటన్నర పాటు ఇంట్లో కలియతిరిగారు. ఇవాళ మార్నింగ్ 6 గంటలకు నాకు తెలిసిందే. కిచెన్ లో కెమెరా కట్ చేశాడు, కింద గ్లాస్ తీసేసి ఇంట్లోకి వచ్చాడు. ముఖానికి మాస్క్, గ్లౌస్, బ్యాగ్ ,షూ ధరించాడు.

పస్ట్ ఫ్లోర్ లోకి వెనుక భాగం నుంచి కిచన్ కిటికిలోంచి లోనికి ఎంటర్ అయ్యాడు. నక్కి నక్కి తిరుగుతూ రెక్కీ చేసిన తీరు అనుమానాలకు తావిస్తోంది. కిచెన్ లో కెమెరా కట్ చేశాడు డైనింగ్ హాల్ లో కెమెరా తిప్పే.సాడు. డ్రాలు తెరిశాడు, అన్ని చిందర వందర పడేశాడు.

ఫస్ట్, సెకెండ్ ఫ్లోర్లలోని అన్నిరూములు తిరిగాడు. 2nd ఫ్లోర్‌లోకి వెళ్ళాడు అంతా కలియ తిరిగాడు. నక్కుకుంటూ.. నక్కు కుంటు వెళ్ళి పోయాడు. తెల్లవారు జామున 4:30నిమిషాలకు ఇంట్లోంచి వెళ్లి పోయాడు. గంటన్నర పాటు వాడు నా ఇంట్లో ఏం రెక్కీ చేశాడో అర్థం కావడం లేదు.

## ఈ ఘటన ఊహించుకుంటేనే భయం వేస్తోంది.

వాడు వచ్చి నప్పుడు ఇంట్లోవాళ్లు ఎవరైనా చూసి ఉంటే.. చంపేసే వాడేమో.. ఏం జరిగేదో ఊహించుకుంటేనే భయం వేస్తోంది. నా ఇంట్లోంచి చిన్నకర్చిప్‌కూడా పోలేదు. నా ఇంట్లో దొంగతనానికే వచ్చి ఉంటే ఏదోటి తీసుకెళ్లాలి కదా. ఈ ఘటన తర్వాత నా ఇంట్లో నుంచి



ఎలాంటి వస్తువులు పోలేదు. ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు ఏమి పోలేవు. తెర్చి ఉన్న అన్ని రూమ్‌లలోకి తిరిగాడు. దొంగతనం చేయడానికి వస్తె ఎదోటి చేసి పోవాలి. మా మనమరాలి రూమ్ లోకి వెళ్ళాడు. ఆ సమయంలో ఆమెకు మెలకువ వచ్చి ఉంటే ఏం చేసే వాడో. నా ఇంట్లో పని చేసే ముగ్గురు కూడా అమ్మాయిలే. వాళ్లకు మెలకు వచ్చినా ఏం జరిగేదోనని భయం వేస్తోంది.

## అదే లేన్‌లో ఉంటాను... అయినా

ముఖ్యమంత్రి ఉండే లేన్ లోనే నేను ఉంటాను. అయినా ఇలా దుండగులు చొరబడటం భయాందోళనకు గురి చేస్తోంది. ఈ విషయంపై ముఖ్యమంత్రి గారు సీరియస్ గా దృష్టి సారించాలి. జాతీయ రాజకీయాల్లోనూ కీలక నేతగా ఉన్న నా ఇంట్లోనే ఈ పరిస్థితి ఉంటే ... భద్రత ఎక్కడ?

## భద్రత పెంచాల్సిందే

నా ఇంట్లోకి దుండగుడు చొరబడిన విషయమై ఇప్పటికే పోలీసులకు కంప్లైంట్ ఫైల్ చేశాను. నాకు సెక్యూరిటీపై సీఎం స్పందించాలి. ఇంటెలిజెన్స్ ig గారితో కూడా మాట్లాడను. జరిగిన విషయం చెప్పి హైసెక్యూరిటీ భద్రత కల్పించాలని కోరాను. గత కొన్న రోజుల క్రితమే నా భర్తకు గన్ మెన్స్ విషయం కూడా లేఖ రాశాను. సీఎం కూడా ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించాలి. నా ఇంట్లి వద్ద హై సెక్యూరిటి భద్రత పెంచాలి.

## పోలీసులే తేల్చాలి

అసలు నా ఇంట్లోకి చొరవబడింది ఎవరు..? ఎందుకొచ్చారన్న విషయంపై చాలా అనుమానాలు కలుగుతున్నాయి. నాకు ఏదైనా ప్రాణ హాణి తల పెట్టాలని చూస్తున్నారా? విషయంపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉంది.

## పున్నమిఘాట్ పరిసరాల శుభ్రతకు
# ఏపీటీడీసీ చైర్మన్ ఆదేశాలు

- ముఖ్యమంత్రి పర్యటన



**విజయవాడ:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 20వ తేదీ విజయవాడ పర్యటన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పున్నమి ఘాట్‌లోని బెరం పార్క్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ, "పర్యాటక ప్రాంతాలు శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండాలి. ముఖ్యమంత్రి గారి పర్యటన సంద ర్భంగా బెరంపార్క్ ప్రాంతం విజయవాడ అందాలను ప్రతిబింబించేలా మెరుగుపరచాలి" అని తెలిపారు.

ఈ నేపథ్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలను వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, పూల మొక్కలు నాటడం, కొత్త బెంచీలు ఏర్పాటు చేయడం, ప్రత్యేక లైటింగ్ సిస్టం మెరుగుపరచాలన్నారు.

"పర్యాటక అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకం. అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన విధంగా అన్ని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడం మన లక్ష్యం," అని డాక్టర్ బాలాజీ స్పష్టం చేశారు.

అంతే కాకుండా, భద్రతా ఏర్పాట్లు, రాకపోకల నియంత్రణ వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# ఎన్టీఆర్, కోట్ల, నీలం, కాసు పేర్లను తొలగించే దమ్ముందా?

- దమ్ముంటే సీఎం నా సవాల్ పై స్పదించాలి
- పొట్టి శ్రీరాములు చేసిన తప్పేంది?
- ఆయన దేశభక్తుడు, స్వాతంత్ర్యం కోసం అనేకసార్లు జైలుకు పోయినోడు
- హరిజనులను ఆలయాల్లోకి ప్రవేశం కల్పించాలని పోరాడిన వ్యక్తి
- అట్లాంటి దేశభక్తుడిని అవమానిస్తారా?
- కాంగ్రెస్ దళిత వ్యతిరేకి... ఆర్యవైశ్య వ్యతిరేకి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని ఆ పార్టీ నాయకులే ఓడించారు
- బీజేపీ అభ్యర్థిని కార్యకర్తలే గెలిపించుకున్నారు
- ఇదే విషయం నరేందర్ రెడ్డికి చెప్పిన
- రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
- తెలంగాణను కాంగ్రెస్ శ్రీలంకలా మారుస్తోంది
- రాబోయే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేసినా ఆశ్చర్యం లేదు
- అర్బన్ నక్సల్స్ చేతిలో కులగణన డేటా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్....
- సిరిసిల్ల జిల్లాలో బీజేపీ ఆత్మీయ సమ్మేళనానికి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు
- వేలాది మందితో ర్యాలీ నిర్వహించిన బీజేపీ జిల్లా నాయకత్వం



**సిరిసిల్ల:** తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. "పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు. దేశ స్వాతంత్ర్యం కోసం అనేకసార్లు జైలుకు పోయినోడు. హరిజనులను ఆలయాల్లోకి ప్రవేశం కల్పించాలని ఉద్యమించి శాసనం చేయించినోడు. శ్రీరాములు లాంటోళ్లు 10 మంది ఉంటే ఎప్పుడో స్వాతంత్ర్యం తెచ్చేటోడినని అన్నారంటే ఆయన గొప్పతనం అర్థం చేసుకోవాలి. అట్లాంటి నేత పేరును తొలగించి అవమానిస్తారా?" అని మండి పడ్డారు.

ఈ సందర్భంగా సీఎంకు సవాల్ విసిరారు. "ఆంధ్రా మూలాలున్నాయని పొట్టి శ్రీరాములు పేరు తొలగించారు. మరి ఆ మూలాలున్న ఎన్టీఆర్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మనందరెడ్డి పేరిట అనేకం ఉన్నాయి. వారి పేర్లను కూడా తొలగిస్తారా?" అని సవాల్ విసిరారు.

బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా రెడ్డబోయిన గోపీ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బండి సంజయ్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే....

కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యుల వ్యతిరేక పార్టీ. దళిత వ్యతిరేక పార్టీ. పొట్టి శ్రీరాములు జయంతి ఈరోజు. ఆయన గొప్ప దేశభక్తుడు. స్వాతంత్ర్య సమరయోధుడు. హరిజనులకు దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలని ఉద్యమించి శాసనం చేయించిన నాయకుడు. ఆంధ్ర రాష్ట్రం కోసమే కాదు.... దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొని అనేకసార్లు జైలుకు పోయిన నాయకుడు. పొట్టి శ్రీరాములు లాంటి వాళ్లు నా వెంట 10 మంది ఉంటే చాలు... దేశానికి ఎప్పుడో స్వాతంత్ర్యం తెచ్చేవాడనని మహాత్మాగాంధీయే చెప్పారంటే ఆయన గొప్పతనం అర్థమవుతుంది.

మద్రాస్ రాష్ట్రం నుండి ఆంధ్రను వేరు చేయాలని ఉద్యమించారే తప్ప ఏనాడూ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదే.. అట్లాంటి మహనీయుడి పేరును తొలగించి తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలనుకోవడం దుర్మార్గం. సురవరం పట్ల మాకు అభ్యంతరం లేదు. గొప్ప వ్యక్తే. మంచి రచయిత. తెలుగు భాష ఉద్ధరణ కోసం పాటుపడ్డారు. ఇయాళ ఆయన బతికుంటే సీఎం చేసిన పనికి బాధపడేవారు. ఆంధ్రా మూలాలున్నాయని పొట్టి శ్రీరాములు పేరును తీసేయడం దారుణం. అట్లయితే ఎన్టీఆర్ పేరును కూడా తీసేస్తారా? కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నీలం సంజీవ్ రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి పేర్లను తొలగిస్తారా? తొలగించే దమ్ముందా సీఎం గారు.. వాళ్లకు ఒక రూల్. పొట్టి శ్రీరాములకు ఇంకో రూలా? సీఎంకు దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి. మద్రాస్ నుండి ఆంధ్రను వేరు చేయాలని మాత్రమే కోరిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. అంతే తప్ప తెలంగాణకు వ్యతిరేకం కాదే.... అట్లాంటి వ్యక్తిని అవమానించడం ఎంత వరకు కరెక్ట్? ఆర్యవైశ్య సమాజమంతా ఆగ్రహంతో ఉంది. హిందూ సమాజమంతా ఆలోచించాలి. ఈ దేశం కోసం పోరాటాలు చేసిన వాళ్లను, త్యాగాలు చేసిన వాళ్లను స్మరించుకోవడం, వారి విగ్రహాలు పెట్టి గౌరవించుకోవడం మన సంస్కారం. వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి రాబోయే తరానికి స్ఫూర్తిగా నిలుపుతాం.

అట్లా కాకుండా అవకాశవాద రాజకీయాలు చేస్తూ మహనీయులను అవమానించడం ఏమాత్రం సరికాదు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తెరమరుగు చేయడం కరెక్ట్ కాదు. యధా రాజా...తథా ప్రజా. రాహుల్ గాంధీ తీరు కూడా అట్లనే ఉంది. ఆయన కూడా యూరప్ పోయి భారత దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని కోరి దేశం పరువు తీసిండు..ఇయాల గోపి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం సంతోషం. నాకు గ్రూపుల్లేవు. నాది ఒకటే గ్రూప్. బీజేపీ గ్రూప్. మోదీ గ్రూప్ మాత్రమే. మీరంతా అట్లనే ఉండాలి. ఇయాళ పొద్దున్నే ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కలిశారు. ఆయనకు నేను చెప్పిన. "మిమ్ముల్ని మీ పార్టీ నాయకులే ఓడగొట్టారు... మమ్ముల్ని మా బీజేపీ కార్యకర్తలే గెలిపించారు"అని చెప్పిన. పోలింగ్ రోజు బీజేపీ కార్యకర్తలను చూసి కాంగ్రెస్ బెంబేలెత్తిపోయారు. బీఆర్ఎస్ అయితే పోటీ నుండే తప్పుకుంది.

సిరిసిల్ల కార్యకర్తలు పోరాట యోధులు. బీఆర్ఎస్ పాలనలో యువరాజు సిరిసిల్లకు వస్తుంటే అడుగడుగునా అడ్డుకుని ప్రజా వ్యతిరేక పాలనపై పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. ఆ భయానికే యువరాజు తాను వచ్చే ముందు బీజేపీ కార్యకర్తలను ముందస్తు అరెస్ట్ లు చేసి జైలుకు పంపేటోడు. అయినా తెగించి కొట్లాడిన చరిత్ర బీజేపీ సిరిసిల్ల కార్యకర్తలదే... అధికారం ఉందని అరాచకాలు చేసే సంస్కృతి బీజేపీకి లేదు. నేను హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న. ఎక్కడైనా అరాచకంగా, అమర్యాదగా వ్యవహరించిన దాఖలాలున్నాయా? మనకు అధికారం శాశ్వతం కాదు... ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయి...వారి సమస్యలను పరిష్కరించడమే మన బాధ్యత.

సిరిసిల్ల పార్టీ నాయకులను నేను చెబుతున్నా... గతంలో ఏం జరిగిందో వదిలేయండి. గతం గత:. క్రమశిక్షణతో వ్యవహరించాలి. కలిసిమెలిసి ఉండాలి. అట్లా కాకుండా అసమ్మతి రాజకీయాలు చేస్తే కన్న తల్లికి ద్రోహం చేసినట్లే. వాటిని ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదు. రాష్ట్రంలో బీజేపీకి మంచి వాతావరణం ఉంది. దయచేసి చెడగొట్టొద్దు. నేనే గొప్ప అని అనుకోవద్దు. బండి సంజయ్ లేకపోయినా పార్టీ నడుస్తది. బీజేపీ అండ లేకపోతే బండి సంజయ్ ను కూడా కుక్కలు కూడా దేకవనే సంగతిని గుర్తుంచుకోండి.రాబోయేవి కార్యకర్తల ఎన్నికలే. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత మాది. బీజేపీ స్ట్రాటజీ ఎట్లుంటదో మీకు తెలుసు. సెస్, ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో ఎట్లా ఫైట్ చేసినమో మీకు తెలుసు. సెస్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే... భయపెట్టి బెదిరించి బీఆర్ఎస్ గెలిచినట్లు అరాచకాలు చేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్ దే. ఎవరెన్ని చేసినా ప్రజలు బీజేపీవైపే ఉన్నారు. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా గెలుపు బీజేపీదే.

తెలంగాణను కాంగ్రెస్ శ్రీలంకలా మారుస్తోంది. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన కొనసాగుతోంది. 15 నెలల్లోనే లక్షన్నర కోట్ల అప్పు చేసి...ప్రజలపై భారం మోపుతోంది. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పు భారం మోపబోతున్నారు. జీతాలివ్వడానికి, ప్రజలకిచ్చిన హామీలను పరిష్కరించడానికి పైసల్లేవంటున్నారు. కానీ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందని తబ్లిగీ జమాతే వంటి సమావేశాలు నిర్వహిస్తోంది. సిగ్గుండాలే. 6 గ్యారంటీలను నెరవేరిస్తే బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుంది. రైతు భరోసా, రుణమాఫీ పైసలన్నీ ఇస్తేనే బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుంది. మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలకు రూ.2500 ఇస్తేనే బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుంది. అవినీతిరహిత పాలన చేస్తే బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుంది. అట్లాకాకుండా అవినీతి, అరాచక పాలన చేస్తూ... ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి బ్రాండ్ ఇమేజ్ పేరుతో లేనిపోని కార్యక్రమాలు నిర్వహిస్తే ఏ విధంగా ఇమేజ్ పెరుగుతుంది?

అప్పులు తీర్చడానికి భూములను అమ్మేయాలనుకుంటోంది. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాలను వేలం వేసి భావి తరాలకు భూములు లేకుండా చేస్తోంది. కాంట్రాక్టర్ల వద్ద 20 శాతం కమీషన్లు దండుకుంటోంది.కులగణన పేరుతో తెలంగాణ ప్రజల ఆస్తిపాస్తుల వివరాలను ప్రభుత్వం సేకరించింది. రహస్య సమాచారమంతా అందజేస్తే ఆ డేటాను అధ్యయనం పేరుతో అర్బన్ నక్సల్స్ చేతిలో పెట్టారు. ఇగ మనం బతుకతమా? అర్బన్ నక్సల్స్ చేతిలో మన డేటా పెడితే... తెలంగాణ ప్రజల ఆస్తిపాస్తులు భద్రంగా ఉంటాయా? దోపిడీకి గురవుతాయా? ఆలోచించాలి. ఇప్పటికే విద్యా కమిషన్ పేరుతో అర్బన్ నక్సల్స్ చేతిలో విద్యా వ్యవస్థను పెట్టి హింసను సృష్టించి తుపాకీ రాజ్యం చేయాలనుకుంటోంది. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులిస్తోంది. ఇయాళ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరుగుతున్నయ్. రాష్ట్రం నయాపైసా ఇస్తలే. అయినా తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందని ఎదురుదాడి చేస్తున్నరు. అన్నీ మేమే ఇస్తే.. ఇగ మీరెందుకు? తప్పుకోండి. డబుల్ ఇంజన్ సర్కార్ తో తెలంగాణను ఎట్లా అభివృద్ధి చేస్తామో చేతల్లో చూపిస్తాం... తెలంగాణలోని ఏ గ్రామానికి కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో... గ్రామాల వారీగా సమగ్ర వివరాలను అందజేస్తాం. గ్రామాల్లోకి కరపత్రాలు, ఫ్లెక్సీలు వేస్తాం.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే. రెండు పార్టీలు డ్రామాలాడుతున్నయ్. బీఆర్ఎస్ చేసిన స్కాంల్లో అరెస్ట్ కాకుండా కాపాడుతోంది. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, ఫార్ములా ఈ రేసు, భూముల కుంభకోణం, కాళేశ్వరంసహా అన్ని స్కాముల్లో కేసీఆర్ కుటుంబం ఉందని తెలిసినా అరెస్ట్ చేయలే. కనీసం నోటీసులు కూడా ఇచ్చే దమ్ము లేకపాయే. కనీసం కేసీఆర్ ను విచారణకు పిలిచే దమ్ము లేకపాయే. ఎందుకంటే రెండు పార్టీలూ ఒక్కటే. బీజేపీ ఇమేజ్ ను దెబ్బతీసుందుకు కలిసి పనిచేస్తున్నయ్. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేసినా ఆశ్చర్యం లేదు. ఏదేమైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. బీజేపీ అధికారంలోకి రాగానే వాళ్ల లెక్కలు తేలుస్తాం...

జనం గుండె చప్పుడు

# మహానాడు

08

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 18, మార్చి 2025 ||

## గోవిందా స్టైల్లో సల్మాన్



బాలీవుడ్‌కా భాయ్ సల్మాన్‌ఖాన్ స్టైలే వేరప్పా. ఎప్పుడూ అభిమానుల గుండెల్లో ఐకాన్‌గా నిలుస్తాడు. స్పార్క్ ఉన్న సూట్లు, స్టైలిష్ క్యాజువల్స్.. ఇతర డిజైనర్ దుస్తుల్లో ప్రతిసారీ సిగ్నేచర్ స్టైల్ తో ఆకట్టుకుంటాడు. అతడి ఛామింగ్ లుక్స్ కి ప్రత్యేకించి ఫాలోయింగ్ ఉంది. కానీ ఎందుకో ఒక్కసారిగా వింతగా మారాడు. అందరిలో అనుమానాలు రేకెత్తించాడు. తాజాగా ఓవర్ ది టాప్ లుక్ తో అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసాడు. కొందరు అతడిని గోవిందాలా మారాడేమిటీ? అని కామెడీలు చేస్తున్నారు. సల్మాన్ కూడా రణ్ వీర్ లా ట్రై చేయాలనుకున్నాడా? కానీ ఇది ఇంకేదో అయింది.. పూర్తిగా తేడా కొట్టింది! అని కొందరు నెటిజనులు కామెంట్లు చేస్తున్నారు. సల్మాన్ ముంబై లోని ఓ డబ్బింగ్ స్టూడియో వెలుపల కనిపించినప్పుడు ఇలా బోల్డ్ డ్రెస్ లో కనిపించాడు. అతడి కొత్త రూపం నిజానికి ఫ్యాషన్ ఔత్సాహికులలో ఉత్సాహం పెంచింది. కానీ ప్రతిసారీ జెంటిల్ మేన్ శైలితో ట్రెండ్ సెట్టింగ్ సెలక్షన్స్ తో అలరించే సల్మాన్, లూయిస్ విట్టన్ మోనోగ్రామ్ జాకెట్ ప్రింటెడ్ దుస్తుల్లో వింతగా కనిపించాడు. ప్రింటెడ్ క్రూ లేయర్డ్-నెక్ టీ-షర్ట్ , యాసిడ్-వాష్డ్ డెనిమ్ జీన్స్ ట్రిపుల్-టోన్డ్ బ్లూ ఎల్వీ జాకెట్ తో తో అతడు కొంత విచిత్రంగా కనిపించాడు. అతడి చెవిపోగులు, బేస్ బాల్ క్యాప్, హై-యాంకిల్ బ్లాక్ స్నీకర్స్, చంకీ రింగులు, స్టేట్‌మెంట్ వాచ్ అతడి బ్రాస్‌లెట్ వంటివి సిగ్నేచర్ స్టైల్ ని ఎలివేట్ చేసినా కానీ, అతడు ధరించిన దుస్తులు ఎబ్బెట్టుగా ఉన్నాయని కామెంట్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సల్మాన్ అభిమానులు అయోమయంలో ఉన్నారు. అతడు గోవిందాను చూసి స్ఫూర్తి పొందాడా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



## ఆది కెరీర్‌ను 'షణ్ముఖ' మలుపు తిప్పాలని కోరుకుంటున్నాను: రఘు నందన్ రావు

ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ' . ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సన్సేషనల్ సంగీత దర్శకుడు రవి బసూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

ఈ చిత్రాన్ని మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యి ఆమన మట్లాడుతూ " షణ్ముఖ ఈ టైటిల్‌లోనే ఎంతో పత్యేకత ఉంది. ఆది కెరీర్‌కు మలుపు తిప్పే సినిమాలా ఉండాలని కోరుకుంటున్నాను. గొప్ప నటుడు సాయికుమార్ వారసుడిగా ఆదికి మంచి పేరు ఉంది. ఈ సినిమాలోని నటీనటులకు, సాంకేతిక నిపుణులకు అందరికి మంచి పేరు తీసుకరావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. షణ్ముఖ టైటిల్‌కు తగ్గట్టుగా దర్శకుడు షణ్ముగం ఈ చిత్రం విషయంలో మల్టీ టాలెంటెడ్‌ను చూపించాడు. తప్పకుండా ఈ చిత్రం అందరికి విజయాన్ని అందిస్తుందని నమ్ముతున్నాను' అన్నారు.



## అర్జున్ S/O వైజయంతి 20 ఏళ్లు గుర్తుండిపోయే సినిమా : నందమూరి కళ్యాణ్ రామ్

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా 'అర్జున్ S/O వైజయంతి' ఫస్ట్ లుక్ పోస్టర్, ప్రీ-టీజర్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. విజయశాంతి ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన అర్జున్ S/O వైజయంతి' ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు నిర్మించారు.ఈ చిత్ర టీజర్ ని మేకర్స్ లాంచ్ చేశారు. ఐపీఎస్ ఆఫీసర్ విజయశాంతి విధి నిర్వహణలో నేరస్థులపై కాల్పులు జరపడంతో టీజర్ ప్రారంభమవుతుంది. చావుకి ఎదురెళ్ళిన ప్రతిసారి ఆమెకు కొడుకు అర్జున్ ముఖం గుర్తుకు వస్తుంది. వైజాగ్‌లో నేరస్థులని నియంత్రించడంలో పోలీసులు, కోర్టులు రెండూ విఫలమైనప్పుడు, అర్జున్ పరిస్థితని తన చేతుల్లోకి తీసుకుంటాడు. చట్టాన్ని ధిక్కరించే ఎవరినీ శిక్షించకుండా ఉండనివ్వనని విజయశాంతి చెప్పడం, అర్జున్ అమ్మకు బర్త్ డే విషెష్ చెప్పడంతో టీజర్ ఎండ్ అవ్వడం చాలా ఇంట్రస్టింగ్ గా వుంది.అర్జున్ S/O వైజయంతిలో దర్శకుడు ప్రదీప్ చిలుకూరి యాక్షన్, డ్రామా, భావోద్వేగాలను అద్భుతంగా బ్లెండ్ చేశాడు. మదర్ డ్యూటీ, కొడుకు కోపం, మంచి, చెడుల మధ్య ఒక ఎపిక్ స్టోరీగా ప్రెజంట్ చేశాడు. నందమూరి కళ్యాణ్ రామ్ ఇప్పటివరకు తన మోస్ట్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ ఆంధించాడు. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో అదరగొట్టాడు. విజయశాంతి కంబ్యాక్ గొప్పగా వుంది. ఆమె తన పాత్ర ఇంటెన్స్ ను, తల్లి యొక్క లోతైన భావోద్వేగాన్ని అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చారు. వారి కెమిస్ట్రీ నెరేటివ్ కి డెప్త్ అండ్ ఇంపాక్ట్ ని యాడ్ చేస్తోంది.

## ఎన్టీఆర్ ప్లానింగ్‌లో గందరగోళం

ఎన్టీఆర్ ఆర్ఆర్ఆర్ సినిమా కోసం దాదాపు నాలుగు ఏళ్లు కేటాయించారు. 2018లో అరవింద సమేత సినిమాతో వచ్చిన ఎన్టీఆర్ ఆ తర్వాత 2022లో ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కొన్ని కారణాల వల్ల ఆర్ఆర్ఆర్ తర్వాత కూడా ఎన్టీఆర్‌కి గ్యాప్ వచ్చింది. ఆ సినిమా తర్వాత రెండేళ్లకు అంటే 2024లో దేవర సినిమా వచ్చింది. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన దేవర సినిమా యావరేజ్ టాక్ సొంతం చేసుకున్నా మంచి వసూళ్లను రాబట్టింది. ఎన్టీఆర్ తదుపరి సినిమాలు ఏంటి అంటే చాలా పెద్ద జాబితా ఉంది. ప్రస్తుతం ఆయన చేస్తున్న సినిమాల లైనప్ చూసి, కొత్తగా ఎంపిక చేసుకుంటున్న సినిమాలను చూసి ఫ్యాన్స్ తెగ మురిసిపోతున్నారు. ఈ ఏడాదిలో ఎన్టీఆర్ నటిస్తున్న 'వార్ 2' సినిమా విడుదల కాబోతుంది. హృతిక్ రోషన్ గాయం కారణంగా షూటింగ్ ఆలస్యం అయింది కానీ లేదంటే ఇప్పటి వరకు వార్ 2 షూటింగ్ పూర్తి అయ్యేది. షూటింగ్ ఆలస్యం అవుతున్నా కచ్చితంగా సినిమాను ఈ ఏడాది ఆగస్టులోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ చెబుతున్నారు. 2025లో ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 విడుదల కావడం కన్ఫర్మ్. ఇక 2026లో ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ డ్రాగన్ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న విషయం తెల్సిందే. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డ్రాగన్ సినిమా ఇప్పటికే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కాగా వచ్చే ఏడాదిలో జనవరి నెలలో సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. సంక్రాంతి కానుకగా డ్రాగన్ వస్తే ఫ్యాన్స్‌కి పండగే. డ్రాగన్ తర్వాత ఎన్టీఆర్ నటించబోతున్న సినిమా ఏంటి అనే విషయమై ఇప్పటికే క్లారిటీ వచ్చింది. నెల్సన్ దిలీప్ దర్శకత్వంలో ఒక సినిమాను ఎన్టీఆర్ చేయబోతున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన కథ చర్చలు జరిగాయి.

పూర్తి స్థాయి స్క్రిప్ట్‌తో నెల్సన్ రావాల్సి ఉంది. ప్రస్తుతం నెల్సన్ చేస్తున్న సినిమా పూర్తి కావడానికి ఏడాది సమయం పడుతుంది. కనుక



ఆ తర్వాత ఎన్టీఆర్‌తో ఆయన సినిమా ఉంటుంది.

## అతిలోక సుందరిలా... నటించాలి



అతిలోక సుందరి శ్రీదేవికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎంతో మంది సెలబ్రిటీలు సైతం ఆమెను అభిమానిస్తుంటారు. రీసెంట్ గా ఓ ఫ్యాషన్ టూర్ లో పాల్గొన్న తమన్నా భాటియాకు ఓ ప్రశ్న ఎదురైంది. ఆన్ స్క్రీన్ పై ఎలాంటి తరహా పాత్రలు పోషించాలనుంది అని అడిగినప్పుడు తమన్నా క్షణం ఆలోచించకుండా వెంటనే శ్రీదేవి పేరు చెప్పింది. శ్రీదేవి 2018లో దురదృష్టవశాత్తూ బాత్ టబ్ లో పడి నీటిలో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. శ్రీదేవిపై తమన్నా తన అభిమానాన్ని ఈ ఈవెంట్ లో వెల్లడించింది. శ్రీదేవి సూపర్ ఐకానిక్ అని, ఆన్ స్క్రీన్ శ్రీదేవిగా నటించాలని కోరుకుంటున్నట్టు తమన్నా తెలిపింది.

శ్రీదేవి మేడమ్ ను ఆరాధించే వ్యక్తుల్లో తాను కూడా ఒకరని తమన్నా ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. స్టీరియోటైప్ పాత్రల నుంచి కామెడీ, డ్రామా వరకు ఎన్నో జానర్లలో పలు విభిన్న పాత్రలను పోషించి ఇండియన్ సినీ హిస్టరీలోనే మొదటి మహిళా సూపర్ స్టార్ గా శ్రీదేవి గుర్తింపు పొందారని తమన్నా చెప్పింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో శ్రీదేవి 50 సంవత్సరాలకు పైగా వివిధ రంగాల్లో కొనసాగారని, మిస్టర్ ఇండియా, సద్మా, హిమ్మత్ వాలా, ఖుదా గవా, లాడ్లా, ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ లాంటి గుర్తుండిపోయే సినిమాల్లో శ్రీదేవి నటించారని తమన్నా తెలిపింది. ఇక తమన్నా విషయానికొస్తే అమ్మడు ఆఖరిగా నీరజ్ పాండే దర్శకత్వంలో వచ్చిన సికిందర్ కా ముఖద్దర్ సినిమాలో నటించింది.

## ఏప్రిల్ 4న లైఫ్ (లవ్ యువర్ ఫాదర్)!

దివంగత లెజెండరీ సింగర్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం తనయుడు సింగర్ ఎస్.పి. చరణ్ చాలా ఏళ్ళ తర్వాత 'లైఫ్' (లవ్ యువర్ ఫాదర్) అనే సినిమాతో మళ్ళీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. మనీషా ఆర్ట్స్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్స్ పై కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మాతలుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో ఈ లైఫ్ (లవ్ యువర్ ఫాదర్) సినిమా రాబోతుంది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా SP చరణ్, నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, రఘుబాబు, షకలక శంకర్, రియా.. వంటి నటీ నటులు ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమాకు సీనియర్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందించారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ కాపీ వచ్చింది. ఆ కాపీని చూసి సంతోషించిన మూవీ టీం మీడియాతో మాట్లాడారు. నిర్మాత అన్నపరెడ్డి రామస్వామి రెడ్డి మాట్లాడుతూ.. "సినిమా చాలా బాగా వచ్చింది. సినిమాలో ఎక్కువ భాగం కాశీలోనే షూట్ చేసాం.

ఈ సినిమాలో దైవత్వంతో పాటు తండ్రి కొడుకుల మధ్య ఉన్న బంధాన్ని కూడా చాలా బాగా చూపించబోతున్నాం. ఫస్ట్ కాపీ చూశాక RR చాలా అద్భుతంగా అనిపించింది. సినిమాపై మా నమ్మకం ఇంకా పెరిగింది. వెంటనే మణి శర్మ గారిని సత్కరించడానికి వెళ్ళాం. RR బాగా కుదిరినందుకు ఆయన కూడా చాలా సంతోషించారు. ఇక ఈ సినిమాను ఏప్రిల్ 4న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాం. ఈ నెల 27న ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుతాం" అని తెలిపారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144